ANN తెలుగు
Follow: @ANNTELUGU
30-04-2025
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 148 | పేజీలు-08 | వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



ప్రపంచ సుందరి పోటీలకు..
## అదిరేలా ఏర్పాట్లు
### హైదరాబాద్‌ను ముస్తాబు చేయండి
**అతిథులకు అసౌకర్యం కలిగించకండి**
**140 దేశాల నుండి ప్రతినిధులు..**
**విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు**
**మిస్ వరల్డ్ - 2025 పోటీల ఏర్పాట్ల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**మే 10న ప్రారంభంకానున్న మిస్ వరల్డ్-2025 పోటీలు**
వివరాలు 3లో

**టాప్ న్యూస్**

### కర్మణ్యేవాధికారస్తే...


- స్మితా సబర్వాల్ మరో సంచలన ట్వీట్
- నాలుగుమాసాల్లో టూరిజం శాఖకు న్యాయం చేశానని ట్వీట్

02

### అయోధ్యలో అక్షయ తృతీయ వేడుక


- 5000 ఆలయాల్లో పూజలు
- అందంగా ముస్తాబు అవుతోన్న అయోధ్య రామాలయం
- రామ్‌లల్లాకు 56 రకాల వంటకాలు

02

### నేడు పదవ తరగతి ఫలితాలు
- మధ్యాహ్నం 1 గంటకు విడుదల చేయనున్న సీఎం రేవంత్

03



### టీవీకే అంటే 'త్రిష - విజయ్ - కీర్తి సురేష్'!
- విజయ్ పార్టీపై మంత్రి పన్నీర్ సెల్వం సంచలన వ్యాఖ్యలు
- తీవ్రమైన డీఎంకే టీవీకే పోరు

వివరాలు 2లో



### మే 15లోగా మండల కమిటీలు పూర్తికావాల్సిందే
- లేకుంటే జిల్లా అధ్యక్షులు రాజీనామా చేయాలి
- టీ.బీజేపీ నేతలకు సునిల్ బన్సల్ సంచలన వార్నింగ్
- 13వేల నకిలీ క్రియాశీల సభ్యత్వాలపై ఆగ్రహం

వివరాలు 2లో




### పవన్ మంచిగ మాట్లాడు
- ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుడు కాదు
- ఉపముఖ్యమంత్రిగా ఉన్నవు.. ఆలోచించి మాట్లాడు
- ఎంపీ చామల స్ట్రాంగ్ కౌంటర్

వివరాలు 3లో

### ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడీకి చెక్..
చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

వివరాలు 7లో





### రాష్ట్ర ఎన్నికల కమిషన్ రెడీ
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే రెడీ అయింది. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో సమావేశాలు, ఎన్నికలు జరిపే స్థానాల నిర్ధారణ వంటి కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

# జూలైలో స్థానికం
## వ్యూహరచనలో ప్రభుత్వం

ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు
**బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం కీలకం**
సంస్థాగత కమిటీలు పూర్తికాగానే.. స్థానిక ఎన్నికలు
రాష్ట్రంలో 570 జెడ్పీటీసీ, 5,817 ఎంపిటీసీ సీట్లు, 12,848 సర్పంచ్ స్థానాలు
ముందుగా జిల్లా పరిషత్.. తర్వాత పంచాయతీ

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఎస్సీరిజర్వేషన్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం, బీసీ బిల్లు పెట్టి గవర్నర్ కు పంపండంతో పాటు ఢిల్లీలో ధర్నా కూడా నిర్వహిచారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్రం తిరస్కరిస్తే తమ పార్టీ తరుపు 42 శాతం టికెట్లు బిసిలకు ఇస్తామని, మిగతా పార్టీలు కూడా అదే రకంగా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటైన డెడికేటెడ్ బీసీ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం, తర్వాత ప్రభుత్వం దేశంలో ఎవరూచేయని విధంగా బిల్లును ప్రవేశపెట్టి కేంద్రానికి పంపండంతో ఈ విషయంలో రాష్ట్ర సర్కారు చేయాల్సిందంతా చేసినట్లయింది.
మిగతా 2లో

# పాక్‌తో ఇక యుద్ధమే..
### డేట్, టైమ్, టార్గెట్ ఫిక్స్ చేయండి..
ఆర్మీకి ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛ
ఇప్పటికే దౌత్యపరంగా దెబ్బకొట్టిన భారత్



**ఢిల్లీ, మహా:** పహల్గామ్ ఉగ్రదాడికి బదులు తీర్చుకునేందుకు భారత్ ఊగిపోతోంది. దీనికి సంబంధించి తాజాగా జరిగిన భేటీలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు, పాక్ విషయంలో ఇండియన్ ఆర్మీకి పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్లు ప్రధాని తెలిపారు. డేట్, టైమ్, టార్గెట్ ఫిక్స్ చేయండి అంటూ సైన్యానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి దీటైన జవాబు ఇస్తామని ఈ సందర్భంగా నరేంద్ర మోదీ తేల్చి చెప్పారు. ఇప్పటికే దౌత్యపరంగా దెబ్బకొట్టిన భారత్.. ఇక సైనిక చర్యకు కూడా సవాలే లేని రీతిలో సై అంటోంది.

**ఆచితూచి లేదు.. ఇక దూకుడే**
పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇప్పటివరకు ఆచితూచి అడుగులు వేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది.
మిగతా 2లో

# డీజీపీ
### కౌన్ బనేగా పోలీస్ బాస్
**ఏడు మందితో జాబితా సిద్ధం**
**యూపీఎస్సీకి జాబితా పంపిన రాష్ట్ర ప్రభుత్వం**

**మహా :** రాష్ట్రానికి త్వరలో కొత్త పోలీస్ బాస్ రానున్నారు. ప్రస్తుత డీజీపీ డాక్టర్ జితేందర్ సెప్టెంబర్ 6 న పదవీ విరమణ చేయనునుండగా కొత్త డీజీపీని నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది.
మిగతా 2లో

## ఎన్ డీఎస్ఏ నివేదిక చూసినా బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడటం లేదు
### నాటి నేతల నిర్లక్ష్యమే కాళేశ్వరం ను దెబ్బతీసింది
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**మహా :** కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్, నిర్మాణంలో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. 'ఎన్‌డీఎస్ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు.
మిగతా 3లో





## ఎన్‌డీఎస్ఏ ఎన్డీఏ జేబు సంస్థ


- మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా లేదు
- మంత్రి ఉత్తమ్ మాటలన్నీ అబద్ధాలే
- మాజీ మంత్రి : హరీశ్‌రావు

03

# భూదాన్ లాండ్ స్కాం
### నకిలీ పత్రాలు సృష్టించి భూ రెవెన్యూ రికార్డులను మార్చారు
**ఈడీ సంచలన ప్రకటన**

**మహా :** మూడు రోజుల క్రితం భూదాన్ భూములకు సంబంధించి ఈడీ అధికారులు నగరంలోని పాతబస్తీలో సోదాలను నిర్వహించిన నేపథ్యంలో తాజాగా ప్రకటన విడుదల చేశారు. మనీలాండరింగ్ వ్యవహారంలో హైదరాబాద్‌లోని ఐదు చోట్ల సోదాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేయడంపై విచారణ చేస్తున్నామని స్పష్టం చేప్రకటనలో పేర్కొన్నారు.
మిగతా 2లో



తాత, ముత్తాతలు సంపాదించిన భూములను
## ధరణి భూతం కొల్లగొట్టింది
- కేసీఆర్ ఎన్ని దొంగ ఏడ్పులు ఏడ్చినా మా అభివృద్ధి ఆగదు
- భూ భారతితో యాజమాన్య హక్కులలో తప్పుల సవరణ
- ఇంతవరకు 3400 దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 15 నాటికి భూ సమస్యలకు పరిష్కారం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు 2లో



## కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఘోర అవమానం
- మంత్రి తుమ్మల ముందే అధికారులకు ఎమ్మెల్యే ఆదినారాయణ వార్నింగ్
- నేను ఉన్నాననుకున్నారా? చచ్చాననుకున్నారా?
- ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేస్తా.. ఎవరినీ వదిలిపెట్టను
- ఎమ్మెల్యేకు తెలియకుండా మంత్రితో శంఖుస్థాపన పెట్టిన అధికారులు



వివరాలు 3లో

## ప్రపంచ సుందరి పోటీలకు..
# అదిరేలా ఏర్పాట్లు



**హైదరాబాద్, మహా:** మిస్ వరల్డ్ 2025 పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మే 10న హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లను అధికారులు సీఎంకు వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు సుమారు 140 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం తెలిపారు. ఎయిర్ పోర్టు, హోటళ్లు, ఈవెంట్లు జరిగే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**విభాగాల వారీగా బాధ్యతలు**

రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు విభాగాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ ను అందంగా ముస్తాబుచేయాలని సూచించారు. మిస్ వరల్డ్2025 ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ఏర్పాట్లు, కార్యక్రమాలపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, పోలీస్ కమిషనర్లు, శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తాత, ముత్తాతలు సంపాదించిన
# భూములను ధరణి భూతం కొల్లగొట్టింది

**కేసీఆర్ ఎన్ని దొంగ ఏడ్పులు ఏడ్చినా మా అభివృద్ధి ఆగదు**

భూ భారతితో యాజమాన్య హక్కులలో తప్పుల సవరణ

ఇంతవరకు 3400 దరఖాస్తుల స్వీకరణ

ఆగస్టు 15 నాటికి భూ సమస్యలకు పరిష్కారం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**మహా :** ధరణి చట్టంతో పేదలను, సామాన్యులను ఏడిపించిన కేసీఆర్‌కు ప్రజలు రెండు సార్లు శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టినందుకు దుఃఖం వస్తుందేమోనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. తండ్రులు, తాతలు ముత్తాతలు సంపాదించిన భూములను ధరణి భూతం కొల్లగొట్టిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పేదల ఆస్తులను ధరణిని అడ్డం పెట్టుకొని వేలాది ఎకరాలను కొల్లగొట్టిన ఆనాటి పెద్దలు కనీసం పశ్చాత్తాపం పడడం లేదని విమర్శించారు. ఏదో పోయినట్లు, ఏదో జరిగినట్లు దుఃఖమొస్తుందని కపట ప్రేమ వొలకబోశారంటూ కేసీఆర్ కన్నీరు మున్నీరుగా దుఃఖించినా సరే, పేద ప్రజలకు చేయాల్సిన సేవ, అభివృద్ధి చేసితీరుతామని స్పష్టం చేశారు. కామారెడ్డి, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలోని షెట్ పల్లి, ఉరుసుగట్టు , సుర్దేపల్లిలో మంగళవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, తరతరాల నుండి సాగుచేస్తున్న భూ యజమానులకు పాసు పుస్తకాలు జారీ చేయడం, తప్పులుగా నమోదు చేసిన పేర్లు సరిచేయడం, నిషేధిత భూములు విషయంలో తప్పులు సరిచేయడం వంటి అంశాలు భూ భారతి చట్టంలో ఉన్నాయన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా భూ భారతి చట్టం తయారు చేయడం జరిగిందని, చట్టంతో పాటు రూల్స్ తయారు చేయడం జరిగిందన్నారు. భూ భారతి 2025 చట్టం ప్రజలకు అర్థమయ్యే విధంగా, 18 రాష్ట్రాలు పర్యటించి 9 నెలల పాటు మేధో మధనం చేసి అధికారులు, మేధావుల సలహాలతో రూపొందించడం జరిగింది. గత ప్రభుత్వం 2020 సంవత్సరంలో తీసుకువచ్చిన చట్టంలో నిబంధనలు లేవు. భూ భారతి చట్టం 50 సంవత్సరాల పాటు మనుగడలో ఉంటుందన్నారు. ఈ చట్టం గురించి అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని 4 జిల్లాల్లోని ఒక్కో మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రజల సమస్యలపై దరఖాస్తులు తీసుకోవడం జరుగుతోంది. అందులో భాగంగానే ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని లింగంపేట్ మండలాన్ని ఎంపిక చేయడం జరిగింది. ఇప్పటివరకు 20 గ్రామాలలో సదస్సులు నిర్వహించి 3400 కు పైగా అభ్యర్థన దరఖాస్తులు తీసుకోవడం జరిగింది.లింగంపేట్ మండలంలోని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భూములు సర్వే చేసి పాస్ బుక్కులో ఎక్కించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి అన్ని మండలాల్లో సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. పర్యటనలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ జిల్లా సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వరంగల్ పట్టణ పరిధిలోని బీఆర్ నగర్‌లోని సింగరబోయిన అనిల్‌కుమార్, యల్లమ్మ దంపతుల ఇంట్లొ సన్నబియ్యం భోజనం తిన్నారు. అనంతరం దఇంటి యజమానులను శాలువతో సత్కరించి రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు

# నేడు పదవ తరగతి ఫలితాలు

**మధ్యాహ్నం 1 గంటకు రిలీజ్ చేయనున్న సీఎం రేవంత్**

**హైదరాబాద్, మహా:** పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదలకు తెలంగాణ విద్యాశాఖ ఎట్టకేలకు ముహూర్తం ఖరారు చేసింది. బుధవారం మధ్యాహ్నం 1 గంటకు సీఎం రేవంత్ రెడ్డి ఫలితాలు విడుదల చేయనున్నారు. ఫలితాలను అధికారిక వెబ్ సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. ఇక ఈసారి పదో తరగతి విద్యార్థులకు గ్రేడ్స్‌తో పాటు గతంలో మాదిరి మార్కులను ఇవ్వనున్నారు. అలాగే, మార్కులతో పాటు సబ్జెక్టుల వారీగా గ్రేడ్స్ కూడా ప్రకటించనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు పొందుపరచనున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈఏడాది రాత పరీక్షలు 80 మార్కులకు, ఇంటర్నల్ మార్కులు 20 మార్కులను నిర్వహించారు. ఈ మేరకు మార్కుల మెమోలను జారీ చేస్తారు. అలాగే వచ్చే ఏడాది నుంచి టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులను కూడా తొలగించి, మొత్తం 6 సబ్జెక్టులకు 100 మార్కుల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నారు.

# డీజీపీ

**కౌన్ బనేగా పోలీస్ బాస్**

**ఏడు మందితో జాబితా సిద్ధం**

**యూపీఎస్సీకి జాబితా పంపిన రాష్ట్ర ప్రభుత్వం**

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ శాఖలో అత్యున్నత పదవి అయిన డీజీపీ ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపింది. యూపీఎస్సీ వారి అర్హతలు, పనితీరు, సర్వీస్ రికార్డులను పరిశీలించి ముగ్గురు సీనియర్ అధికారుల పేర్లతో తుది జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. ఆ జాబితా నుంచే కొత్త డీజీపీని ఎన్నుకోనున్నారు. ప్రస్తుతానికి డీజీపీ పదవి కోసం ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం యూపీఎస్సీకి పంపిన జాబితాలో 1990 బ్యాచ్‌కు చెందిన రవి గుప్తా, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్, 1994 బ్యాచ్‌కు చెందిన ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, బి.శివధర్ రెడ్డి, డాక్టర్ సౌమ్య మిశ్రా, శిఖా గోయల్ ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే రవి గుప్తాను డీజీపీగా నియమించగా ఆ తర్వాత ఆయన స్థానంలో జితేందర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రవి గుప్తా హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పోటీలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారుల పదవీ విరమణ తేదీలను పరిశీలిస్తే కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈ ఏడాది ఆగస్టులో, రవి గుప్తా డిసెంబర్‌లో, సీవీ ఆనంద్ 2028 జూన్‌లో, ఆప్టే వినాయక్ ప్రభాకర్ 2029 అక్టోబర్‌లో, బి.శివధర్ రెడ్డి 2026 ఏప్రిల్‌లో, డాక్టర్ సౌమ్య మిశ్రా 2027 డిసెంబర్‌లో, శిఖా గోయల్ 2029 మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. అయితే ఈ రేసులో సీనియారిటీ ప్రకారం..రవి గుప్తా, సీవీ ఆనంద్, శివధర్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎవరిని కొత్త డీజీపీగా నియమిస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. శివధర్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ నిఘా విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీవీ ఆనంద్ హైదరాబాద్ సీపీగా కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన జాబితాలో నుంచి ముగ్గురు పేర్లను ఎంపిక చేసి యూపీఎస్ సీ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనుంది. ఆ ముగ్గురిలో నుంచి రాష్ట్ర ప్రభుకత్వం ఒకరిని ఎంపిక చేయనుంది.

## కేసీఆర్ దుఃఖం దేనికి?
# అధికారం పోయిందనా?

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం**

తప్పేచేసింది కాబట్టే మూడోసారి ప్రజలు వాతపెట్టారు

రాబోయే నాలుగేళ్ళలో 20లక్షల ఇళ్ళు నిర్మిస్తాం

**కామారెడ్డి, వరంగల్, మహా:** తప్పు చేసింది కాబట్టే రెండు సార్లు అవకాశం ఇచ్చిన ప్రజలే మూడోసారి బీఆర్ఎస్ కు వాతలు పెట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దుఃఖం వస్తోందని పదే పదే అంటున్నారని పదవి పోయిందని దుఃఖం వస్తోందా? లేక మీ అవినీతి బయటపడుతోందని దుఃఖం వస్తోందా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూడలేకే కేసీఆర్ కు దుఃఖం వస్తోందని విమర్శలు గుప్పించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా షట్ పల్లి, వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారులు మాట వినలేదని గతంలో కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థనే రద్దు చేశారని పది రోజుల్లో గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తామని చెప్పారు. జూన్ 2 నుంచి ఆగస్టు 15 లోపు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో భూభారతి ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

### నాలుగేళ్ళలో 20లక్షల ఇండ్లు

రూ. 8.19 లక్షల కోట్ల అప్పులు చేసి ధనిక తెలంగాణను అప్పుల రాష్ట్రంగా చేసి బీఆర్ఎస్ మా చేతిలో పెట్టిందని మంత్రి ధ్వజమెత్తారు. పదేళ్లలో రెండు పడక గదుల ఇళ్లు ఎంత మందికి ఇచ్చారో మాజీ సీఎం చెప్పాలన్నారు. పదేళ్లలో పూర్తి చేయకుండా మొండిగోడలు ఉంచిపోతే పూర్తి చేసి మేము ప్రజలకు ఇస్తున్నామన్నారు. పేదల కన్నీరు తీర్చేది ఇందిరమ్మ ప్రభుత్వం అన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అన్ని వర్గాలను ఆదుకునే విషయంలో ఈ ప్రభుత్వం ఒక్క అడుగు వెనక్కి వేయదన్నారు. అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్న వారి కలలు కలలుగానే మిగులుతాయన్నారు.


# టీవీకే అంటే త్రిష - విజయ్ - కీర్తి సురేష్!

విజయ్ పార్టీపై మంత్రి పన్నీర్ సెల్వం సంచలన వ్యాఖ్యలు

తీవ్రమైన డీఎంకే టీవీకే పోరు



**మహా:** వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు రాజకీయాలు వేడెక్కిపోతున్నాయి. ఈ సమయంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, సినీ నటుడు విజయ్ పై డీఎంకే నేత, మంత్రి పన్నీర్ సెల్వం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ అక్షరాల్లో సినిమా హీరోయిన్స్ పేర్లు పెట్టి కామెంట్ చేశారు. అవును... తమ్మిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పై పన్నీర్ సెల్వం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... బ్లాక్ టిక్కెట్లు అమ్ముకునే వ్యక్తి తమకు అవినీతి గురించి పాఠాలు చెప్పడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందని చెప్పిన ఆయన.. విజయ్ తీసుకునే రెమ్యునరేషన్ అంతా బ్లాక్ మనీ అని అందరికీ తెలిసిందే అంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో.. "విజయ్ పార్టీ (టీవీకే) అంటే ఏమిటి? అని అక్కడున్న జనసమూహాన్ని పన్నీర్ సెల్వం కోరగా.. అక్కడున్నవారు "టీత్రిష, వీవిజయ్, కేకీర్తి సురేష్" అని సమాధానం ఇవ్వడం గమనార్హం. దీంతో... మీరంతా బ్రిలియంట్స్ అంటూ మంత్రి స్పందించారు. ఇలాంటి పార్టీ అధికారంలోకి వస్తామని చెబుతుంటే నమ్మడానికి ప్రజలు పిచ్చోళ్లు కాదని పన్నీర్ సెల్వం అన్నారు. కాగా... 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధానంగా డీఎంకే టీవీకే మధ్య మాటల యుద్ధాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఈ సమయంలో... గత కొదీ రోజులుగా సీఎం స్టాలిన్ పై కొన్ని రోజులుగా విజయ్ ఘాటుగా స్పందిస్తున్నారు. అధికార పార్టీలో అవినీతి పెరిగిపోతుందంటూ పలు వేదికలపై విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే టీవీకే విజయ్ ను డీఎంకే నేతలు టార్గెట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రాన్ని నడపటం అంటే సినిమాల్లో నటించడం అంత సులభం అనుకుంటున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా... టీవీకే పార్టీ పేరులో హీరోయిన్స్ పేర్లు పెట్టిన విషయం ఇప్పుడు వైరల్ గా మారింది.



## కర్మణ్యేవాధికారస్తే

**స్మితా సబర్వాల్ మరో సంచలన ట్వీట్**

నాలుగుమాసాల్లో టూరిజం శాఖకు న్యాయం చేశానని ట్వీట్

**హైదరాబాద్, మహా:** ఐఎఎస్ స్మితా సబర్వాల్ ఫైనాన్స్ కమిషన్ కు బదిలీ అయ్యారు. మంగళవారం పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆమె రిలీవ్ అయ్యారు. దీంతో ఆమె ఎక్స్ లో ఆసక్తికర పోస్ట్ చేశారు. 'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన' అని ట్వీట్ చేశారు. మిస్ వరల్డ్ పోటీలు మరో పది రోజులుండగానే ఆమె పర్యాటక శాఖకు దూరమయ్యారు. ఇటీవల ప్రభుత్వాన్ని ధిక్కరిస్తూ చేసిన వివాదాస్పద ట్వీట్లతో ఆమె ఇష్టపడ్డ శాఖను వదిలి సెక్రటేరియట్ బయటకు వెళ్ళాల్సివచ్చింది. ఆమె ట్వీట్లు పలు వివాదాలకు దారి తీసినా ఇంకా కొనసాగిస్తోంది. కంచ గచ్చిబౌలి భూవివాదంలో ఆమె ఏఐ ఫోటో రిట్వీట్ చేసిందని పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ వివాదం అలా ఉండగానే ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై వేటు పడింది. ప్రస్తుతం ఆమె పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. ఆమె మిస్ వరల్డ్ పోటీలకు సన్నాహాలు చేస్తున్నా ప్రభుత్వం పాత స్థానానికి బదిలీ చేసింది. స్మితా సబర్వాల్‌ను ఆర్థిక సంఘం(ఫైనాన్స్ కమిషన్) సభ్య కార్యదర్శిగా నియమించింది. నాలుగుమాసాల్లోనే టూరిజం పాలసీ పూర్తిచేయడంతో పాటు నిర్లక్ష్యానికి గురైన టూరిజం ప్రాంతాలను గుర్తించి డెవలప్ చేసినట్లు ట్వీట్ లో పేర్కొన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిస్ వరల్డ్ పోటీలపై నూతన అధికారులతో సమీక్ష చేశారు.

# 5000 ఆలయాల్లో పూజలు

అందంగా ముస్తాబు అవుతోన్న అయోధ్య రామాలయం

రామ్‌లల్లాకు 56 రకాల వంటకాలు



**మహా:** హిందువుల పవిత్ర పండగైన అక్షయ తృతీయ కోసం అయోధ్య రామాలయం ముస్తాబు అవుతోంది. ఈ పవిత్రదినాన రామమందిరం సహా అయోధ్యలోని 5000 దేవాలయాలలో మతపరమైన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. రామ్‌లల్లాకు 56 రకాల వంటకాలు, సీజనల్ పండ్లను సమర్పించనున్నారు. అక్షయ తృతీయ సందర్భంగా అయోధ్య రామాలయానికి భక్తులు పోటెత్తే అవకాశం ఉండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


### అక్షయ తృతీయ స్పెషల్ ఇదే

హిందూ మతంలో వైశాఖ మాసం విష్ణువుకు ఇష్టమైన నెలగా పరిగణిస్తారు. అక్షయ తృతీయనాడు బంగారం, వెండి కొనడం, దానధర్మాలు చేయడం శుభప్రదంగా భావిస్తారు. అందుకే ఈ తిథిని యుగాది అని కూడా పిలుస్తారు. విష్ణుమూర్తి మరో అవతారమైన పరశురాముడు అక్షయ తృతీయ నాడే జన్మించాడని నమ్ముతారు. అదే సమయంలో రైతులు తమ పొలాలను దున్నడం, విత్తడం నాటడం వంటి పనులను ప్రారంభిస్తారు. హిందూ మత విశ్వాసం ప్రకారం అక్షయ తృతీయనాడు ఏ పని ప్రారంభించినా అది పూర్తవుతుందని భక్తుల నమ్మకం. అందుకే దేవాలయాలకు భక్తులు పోటెత్తుతారు. ఈ నేపథ్యంలో అయోధ్య రామాలయం అందంగా ముస్తాబు అవుతోంది.

### అందంగా ముస్తాబైన రామాలయం

అయోధ్యలోని అన్ని దేవాలయాలలో శ్రీరాముడిని మహావిష్ణువు 11వ అవతారంగా పూజిస్తారు. అక్షయ తృతీయనాడు దేవాలయాల గర్భగుడిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఉదయాన్నే విగ్రహామూర్తులకు అభిషేకం చేసి, కాటన్ వస్త్రాలతో ముస్తాబు చేస్తారు. ఆ తర్వాత హారతి ఇస్తారు. మధ్యాహ్నం సీజనల్ పండ్లను, వివిధ రకాల వంటకాలను శ్రీరాముడికి సమర్పిస్తారు. ఆ తర్వాత ప్రసాదాన్ని భక్తులను పంచుతారు. గతేడాది అక్షయ తృతీయ సందర్భంగా అయోధ్య రామయ్యకు 1,100 మామిడి పండ్లు, సీజనల్ ఫ్రూట్స్ ను ప్రత్యేక నైవేద్యంగా పెట్టారు. ఈసారి కూడా అలాగే రామ్ లల్లాకు అదే విధమైన ప్రసాదాన్ని సమర్పించేందుకు సిద్ధవువుతున్నారు.

# భూదాన్ లాండ్ స్కాం



(మొదటి పేజీ తరువాయి)

నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని, ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించడంపై ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో ఉన్న భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించామని, ఖాదర్ ఉన్నిసా పూర్వీకుల ఆస్తిగా చెప్పి రెవెన్యూ రికార్డులను మోసపూరితంగా మార్చేశారని తెలిపారు. కొంత మంది దళారులతో కలిసి భూమిని వివిధ సంస్థలకు విక్రయించారని, ఈ మధ్యవర్తులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు అమ్మకాలు చేశారన్నారు. అందుకోసం నకిలీ పత్రాలను సృష్టించి, భూ రెవెన్యూ రికార్డులను మార్చినట్లు విచారణలో తేలిందని వెల్లడించారు. నిషేధిత జాబితా నుండి పేర్కొన్న భూమిని డినోటిఫై చేయడంతో పాటు కొన్ని ప్రైవేట్ పార్టీలకు విక్రయించారన్నారు. ఖాదేరునిస్సా, మహమ్మద్.. మునావర్ ఖాన్, మహమ్మద్.. లతీఫ్ షర్ఫాన్, మహమ్మద్.. అక్తర్ షర్ఫాన్, మహమ్మద్.. సుకూర్‌లు ప్రభుత్వ భూమిని మోసపూరితంగా అమ్మకాలు, కొనుగోలు చేసిన పత్రాలు సీజ్ చేశామని తెలిపారు. 23 లక్షల రూపాయల నగదు, విదేశీ కరెన్సీ 12000 దిర్హామ్ సీజ్ చేశామని, మహమ్మద్ ఫామ్‌హౌస్ లో 45 కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా విచారణ కొనసాగుతుందని తెలిపారు.

# పాక్‌తో ఇక యుద్ధమే..


**డేట్, టైమ్, టార్గెట్ ఫిక్స్ చేయండి..**

ఆర్మీకి ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛ

ఇప్పటికే దౌత్యపరంగా దెబ్బకొట్టిన భారత్

(మొదటి పేజీ తరువాయి)

దాయాది దేశాన్ని అన్ని రకాలుగా దిగ్బంధనం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేసిన భారత్.. ఇప్పుడు ఆ దేశంపై నేరుగా దాడి చేసేందుకు రెడీ అయింది. పాక్‌తో ఉద్రిక్తతల వేళ.. తన నివాసంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ ధోవల్, త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ కీలక భేటీ నిర్వహించారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత క్షణం తీరిక లేకుండా వరుస భేటీలు నిర్వహిస్తూ దీనిపై ఎలా ముందుకు వెళ్లాలి అనేది సమాలోచనలు జరుపుతున్నారు. ఇప్పటికే దౌత్య పరంగా, ఆర్థిక పరంగా పాకిస్తాన్‌ను దెబ్బ కొట్టిన భారత్.. మరిన్ని ఆంక్షలు, నిషేధాలతో ఉక్కిరి బిక్కిరి చేసేందుకు సిద్ధం అవుతోంది. కేవలం యుద్ధం, సర్జికల్ స్ట్రైక్స్ మాత్రమే కాకుండా.. మోదీ సర్కార్ మరింత పెద్ద ప్లాన్ వేస్తోందనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.



ఉగ్రవాదాన్ని అణచివేయడమే

ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన కీలక సెక్యూరిటీ భేటీలో ప్రధాని మోదీ.. కీలక ఆదేశాలిచ్చారు. ఉగ్రవాదంపై చేస్తున్న పోరులో భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయడమే తమ సంకల్పమని తేల్చి చెప్పారు. భారత సాయుధ దళాల సామర్థ్యంపై తమకు పూర్తి స్థాయిలో విశ్వాసం ఉందని వెల్లడించారు. ఇక ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ సైన్యానికి ఉంటుందని ప్రధాని మోదీ ప్రకటించారు. తేదీ, సమయం, లక్ష్యం నిర్ణయించుకునే అధికారాన్ని ప్రధాని మోదీ సైన్యానికే వదిలేశారు. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందోననే ఉత్కంఠ కొనసాగుతోంది.

# ఎన్ డీఎస్ఏ ఎన్డీఏ జేబు సంస్థ

**మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా లేదు**

**మంత్రి ఉత్తమ్ మాటలన్నీ అబద్ధాలే.. మాజీ మంత్రి : హరీశ్‌రావు**



**మహా :** కాళేశ్వరంపై ఎన్ డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారన్నారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఘోర అవమానం

**మంత్రి తుమ్మల ముందే అధికారులకు ఎమ్మెల్యే ఆదినారాయణ వార్నింగ్**

**నేను ఉన్నాననుకున్నారా? చచ్చాననుకున్నారా?**

**ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేస్తా.. ఎవరినీ వదిలిపెట్టను**

**ఎమ్మెల్యేకు తెలియకుండా మంత్రితో శంఖుస్థాపన పెట్టిన అధికారులు**



**అశ్వారావుపేట, మహా:** అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు తన సొంత నియోజకవర్గంలోనే ఘోర అవమానం జరిగింది. ఈ అవమానంపై మంత్రి ఎదుటే అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు . ఇంతకీ ఏం జరిగిందంటే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గంలో రూ.15 కోట్ల విలువైన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు తెలియకుండానే ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. దీనిపై సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి కార్యక్రమ స్థలానికి వెళ్ళి అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. మంత్రి ముందే ఎమ్మెల్యే ఆదినారాయణ అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యేను ఉన్నాను అనుకున్నారా? చచ్చాను అనుకున్నారా? అంటూ కఠినంగా మాట్లాడారు. ఈ ఘటనపై సీఎంకు ఫిర్యాదు చేస్తానని.. దీనికి బాధ్యులైన ఏ ఒక్క అధికారిని వదలబోనని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకి తుమ్మల ఎంతో నచ్చజెప్పగా ఆయన శాంతించి తదుపరి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఎన్ డీఎస్ఏ నివేదిక చూసినా బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడటం లేదు


**నాటి నేతల నిర్లక్ష్యమే కాళేశ్వరం ను దెబ్బతీసింది**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




(మొదటిపేజీ తరువాయి)

సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80 వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే, ఇప్పటికే లక్ష కోట్లు దాటిపోయిందన్నారు. వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారన్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారని, బీఆర్ఎస్ హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు, వాళ్ల హయాంలోనే కూలిపోయిందన్నారు. ఎన్‌డీఎస్ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిందని, చట్టం చేసినప్పుడు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతిచ్చారని గుర్తు చేశారు. బ్యారేజీల భద్రతపై ఎన్‌డీఎస్ఏ అత్యున్నత బోర్డు, దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది, వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైందని పేర్కొన్నారు. తుమ్మడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందన్నారు. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చిందన్నారు. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయని, లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగిందన్నారు. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై బీఆర్ఎస్ ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారని, బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయని, బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్‌డీఎస్ఏ నివేదిక చెబుతోందని, నిర్మాణం మొదలు పెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారని పేర్కొన్నారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు చేసిన నిపుణుల బృందమే చెప్పిందన్నారు. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారన్నారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించారన్నారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.




## రాష్ట్ర ఎన్నికల కమిషన్ రెడీ

**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే రెడీ అయింది. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో సమావేశాలు, ఎన్నికలు జరిపే స్థానాల నిర్ధారణ వంటి కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.**

# జూలైలో స్థానికం

## వ్యూహరచనలో ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో బీసీ బిల్లుపై కేంద్రం లేదా న్యాయస్థానాల సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారుచేసి ముందుకు వెళ్ళే యోచనలో ఉంది. బీసీలకు పెద్ద సంఖ్యలో సీట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆలోచనగా ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రక్రియ ప్రారంభించింది. బూత్ స్థాయి నుండి మండల, పట్టణ కమిటీలు మే 26వ తేదీలోగా పూర్తి కానుండగా, జూన్ మొదటివారం లోగా డిసిసిలు కూడా ప్రకటించనున్నారు. జూలై మధ్యలో లేదా జూలై ఆఖరుకల్లా స్థానిక సమరం ప్రారంభించాలని, ఎన్నికలకు అది సరైన సమయమని సర్కారు భావిస్తోంది. తెలంగాణ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, సన్నబియ్యం, రైతు రుణమాఫీ, బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలతో కాస్త ఆలస్యమైనా ఇచ్చిన ప్రతి మాట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేరుస్తాడన్న నమ్మకం ప్రజల్లో పెరిగింది. దీంతో స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తోంది.

### రిజర్వేషన్ల లెక్కే కీలకం

ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలనే నిబంధన ఉండటంతో.. ఆ మేరకు రిజర్వేషన్లకు ఖరారు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12,848 గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలు 5,817, ఎంపీపీలు 570, జెడ్పీటీసీ స్థానాలు 570 ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలన్నీ ఎస్టీలకు రిజర్వ్ చేస్తారు. మిగతా ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయిస్తారు. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రకారం.. రాష్ట్ర జనాభాలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) 17.43 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) 10.45 శాతం ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి, అదే సమయంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. దీనితో ఎస్సీలకు 17.43 శాతం, ఎస్టీలకు 10.45 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. వీటిని మినహాయిస్తే.. బీసీలకు 22.12 శాతమే రిజర్వేషన్లు అందుతాయి. ఇటీవల తెలంగాణలో ముస్లిం మైనార్టీలలోని వెనుకబడిన తరగతుల వారితో కలిసి మొత్తం బీసీ జనాభా 56.33 శాతమని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలనే డిమాండ్ వస్తోంది. కేంద్రం నిర్ణయాన్ని బట్టి బిసి రిజర్వేషన్లు ఆధారపడి ఉన్నాయి. నిర్ణయం ఎలా ఉన్నా 42శాతం స్థానాలు బిసిలకు కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ చెబుతోంది.




**అసెంబ్లీకి వస్తే.. కేసీఆర్ పిల్లలకు**

# పాలపీకా, డైపర్లు అందిస్తాం

**ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ ఫహీం**

**హైదరాబాద్, మహా:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిల్లలు అసెంబ్లీకి వస్తే పాలపీకా, డైపర్లు అందిస్తామని తెలంగాణ ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ ఫహీం ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ లో కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు తనను అసెంబ్లీకి రావాలని అడుగుతున్నారని, మా పిల్లలకే సమాధానం చెప్పలేకపోతున్నారు.. నేనెందుకు? అని వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ నేత ఫహీం స్పందిస్తూ.. బీఆర్ఎస్ నేతలకు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫహీం మాట్లాడుతూ.. అసెంబ్లీకి నేను రావాలా.. నా పిల్లలను పంపిస్తా అని కేసీఆర్ మాట్లాడుతున్నారని, గత రెండు మూడు అసెంబ్లీ సెషన్లలో మాట్లాడటానికి సీఎం రేవంత్ రెడ్డి నిలబడితేనే మీ పిల్లలకు తడిచిపోతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందుకే ఈ సారి అసెంబ్లీ సెషన్ కు మీ పిల్లలు ఎవరు వస్తారో లిస్ట్ ఇస్తే.. ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ గా బూస్ట్, హార్లిక్స్ ఇస్తామని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి ప్రత్యేకంగా పాలపీకా, సెరెలాక్, డైపర్లు అందిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేగాక కేసీఆర్ పిల్లలు కేటీఆర్, హరీష్ రావు మాత్రమేనా ఇంకా ఎవరు ఉన్నారో జాబితా పంపిస్తే వారికి ఫుడ్ కార్పోరేషన్ తరుపున ఈ వస్తువులు ఇస్తామని కాంగ్రెస్ నేత అన్నారు.

# పాకిస్థాన్‌ను నాలుగు ముక్కలు చేయాలి

**సుబ్రహ్మణ్యస్వామి సంచలన ట్వీట్**

**బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ స్వతంత్ర దేశాలుగా ఏర్పడాలని వ్యాఖ్య**

**పశ్చిమ పంజాబ్‌ను 'బకిస్థాన్'గా పేర్కొన్న స్వామి**



**మహా:** బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్యస్వామి చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం రాజకీయ, దౌత్య వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేసి, నాలుగు ప్రాంతాలుగా విభజించాలంటూ ఆయన చేసిన సూచన ప్రకంపనలు సృష్టిస్తోంది. "పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేయడమే మన దీర్ఘకాలిక లక్ష్యం" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ ప్రాంతాలు విడిపోయి స్వతంత్ర దేశాలుగా ఏర్పడాలని ఆయన అన్నారు. పాక్ లోని పశ్చిమ పంజాబ్ ప్రాంతాన్ని వ్యంగ్యంగా 'బకిస్థాన్' అని సంబోధిస్తూ, దానిని శత్రువుగా చూడాలని అభిప్రాయపడ్డారు. ఈ ట్వీట్ ద్వారా, పాకిస్థాన్ లోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న వేర్పాటువాద ఉద్యమాలకు స్వామి పరోక్షంగా మద్దతు ప్రకటిస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ లలో దశాబ్దాలుగా స్వాతంత్ర్య ఆకాంక్షలు, అసంతృప్తి కొనసాగుతున్న నేపథ్యంలో స్వామి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. బలూచిస్థాన్ ప్రాంతానికి చెందిన బలోచ్ లిబరేషన్ ఆర్మీ వంటి సంస్థలు పాక్ ప్రభుత్వంతో పోరాడుతున్న విషయం తెలిసిందే. ఇదే తరహా అభిప్రాయాలను గతంలో ఇతర బీజేపీ నేతలు కూడా వ్యక్తం చేశారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఇటీవల మాట్లాడుతూ, బలూచిస్థాన్ స్వాతంత్ర్య ఉద్యమం కారణంగా పాకిస్థాన్ నుంచి విడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే కూడా 2025 నాటికి పాకిస్తాన్ మూడు ముక్కలవుతుందని (బలూచిస్థాన్, పఖ్తూనిస్థాన్, పంజాబ్) అభిప్రాయపడ్డారు. స్వామి తాజా ట్వీట్ ఈ చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

# మే 7 నుంచి ఆర్టీసీ సమ్మె

**సమ్మె పోస్టర్ ను ఆవిష్కరించిన ఆర్టీసీ జేఏసీ**

**5 వ తేదీన ఆర్టీసీ కళ్యాణ మండపం నుంచి బస్ భవన్ వరకు కార్మిక కవాతు**

**వెల్లడించిన ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదుర వెంకన్న**

**మహా :** తెలంగాణలో ఆర్టీసీ సమ్మె తేదీ ఖరారైంది. మే 7వ తేదీ నుంచి సమ్మెకు వెళ్లబోతున్నట్లు ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదుర వెంకన్న స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సమ్మె పోస్టర్ ను జేఏసీ నేతలు విడుదల చేశారు. మేడే స్ఫూర్తితో ఆర్టీసీ సమ్మెకు సిద్ధమయ్యామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై వెంటనే స్పందించాలని ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆర్టీసీ కార్మిక జేఏసీ సమావేశమైంది. అనంతరం ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదుర వెంకన్న మాట్లాడుతూ, సమ్మెకు ముందు అంటే మే 5వ తేదీన ఆర్టీసి కార్మికులు కార్మిక కవాతు నిర్వహిస్తామన్నారు. ఆర్టీసి కళ్యాణ మండపం నుంచి బస్సు భవన్ వరకు ఈ సమ్మెకు మద్దతుగా ఆర్టీసి యూనిఫారంలో కార్మికులంతా ఈ కవాతులో పాల్గొంటారన్నారు. అయితే కొన్ని ఆర్టీసీ కార్మికుల సంఘాలు జేఏసీలోకి వస్తామని చెప్పి.. మళ్లీ యాజమాన్యంతో మద్దతుగా తమతో కలవడం లేదన్నారు. యూనియన్‌లకు అతీతంగా అందరు సమ్మెకు కలిసి రావాలని వెంకన్న పిలుపు నిచ్చారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ వేగవంత చేయాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు మూలమైన ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేసి నడపాలన్నారు. 2021 వేతన సవరణ చేయాలని, అలాగే పెండింగ్ బకాయిలను సైతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసి కార్మికులకు ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ చేపట్టాలని సూచించారు. సంస్థలో 16 వేల మంది రిటైరయ్యారని ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆర్టీసీలో నెలకొన్న సమస్యలపై తమ వైఖరిని తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. మరోవైపు ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, తమ సమ్మెపై ఇప్పటికే లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. ఆర్టీసీపై మీ వైఖరి చెప్పాలని ఈ సందర్భంగా సీఎంను వారు డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే మిగిలిన కార్మిక సంఘాలు కలిసి రావాలన్నారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు, ప్రైవేట్ బస్సులను నడపొద్దని పేర్కొన్నారు.

## మే 15లోగా మండల కమిటీలు

# పూర్తికావాల్సిందే

**లేకుంటే జిల్లా అధ్యక్షులు రాజీనామా చేయాలి**

**టీ.బీజేపీ నేతలకు సునిల్ బన్సల్ సంచలన వార్నింగ్**

**13వేల నకిలీ క్రియాశీల సభ్యత్వాలపై ఆగ్రహం**



**హైదరాబాద్, మహా:** మే 15వ తేదీలోగా మండల కమిటీలన్నీ పూర్తి కావాలని, లేదంటే జిల్లాల అధ్యక్షులు రాజీనామాలు చేయల్సి ఉంటుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ తెలంగాణ బీజేపీ నేతలను హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన పార్టీ రాష్ట్ర పదాధికారులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సునిల్ బన్సల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాల అధ్యక్షులు, పార్టీ కీలక నేతలపై సీరియస్ అయ్యారు. మండల కమిటీలు ఇంకా పూర్తి చేయకపోవడంపై మండిపడ్డారు. మే 15వ తేదీలోగా మండల కమిటీలన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. నకిలీ క్రియాశీలక సభ్యత్వాలు చేయించడంపైనా మండిపడ్డారు. 13 వేల వరకు నకిలీ సభ్యత్వాలు ఉన్నాయని అన్నారు. అంతేకాదు.. బీజేపీ పోరాటాల్లోనూ వేడి తగ్గిందని.. క్షేత్రస్థాయి పోరాటాల్లో వేగం పెంచాలని చెప్పారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో అందుకు సిద్ధంగా ఉండాలని.. సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ విమర్శలకు ఏ విధంగా కౌంటర్ ఇవ్వాలో చర్చించారు.




## పవన్ మంచిగ మాట్లాడు

- ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుడు కాదు
- ఉపముఖ్యమంత్రిగా ఉన్నవు.. ఆలోచించి మాట్లాడు
- ఎంపీ చామల స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, మహా:** కొందరు కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్ ను ప్రేమిస్తారని.. వారు అక్కడికే వెళ్లిపోవాలంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి 140 సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న నాయకుడు ఆలోచించి మాట్లాడాలని సూచించారు.

# దేశ వ్యతిరేకులపై స్పైవేర్ ఉపయోగిస్తే తప్పేంటీ?

**దుర్వినియోగం చేస్తే తప్పవుతుంది.. 'పెగాసస్'పై సుప్రీం కీలక వ్యాఖ్యలు**

**ప్రస్తుతం దేశ పరిస్థితిని ఆలోచించండి.. అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్న సర్వోన్నత న్యాయస్థానం**

**మహా :** నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగి ఉండటం తప్పులేదని కోర్టు స్పష్టం చేసింది. అయితే, అది ఎలా, ఎవరిపై ఉపయోగించారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషన్ తరఫున న్యాయవాది వాదనలను వినిపిస్తూ పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తోందా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలన్నారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి సాంకేతిక నిపుణుల బృందం నివేదిక కోసం సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిందని, ఇప్పటివరకూ ఆ నివేదిక అందలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. ఇందుకు ధర్మాసనం బదులిస్తూ ''దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక అందులో తప్పేముంది. అయితే, దాన్ని ఎవరిపైన ఉపయోగిస్తున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. పౌర సమాజంపై కాకుండా దేశ వ్యతిరేక శక్తులపై దీన్ని వినియోగిస్తే గనుక అందులో ఏ తప్పు లేదు. దేశ భద్రత విషయంలో రాజీ పడకూడదు. ఒకవేళ సామాన్య పౌరులపై ఉపయోగిస్తే గనుక దాని గురించి మేం దర్యాప్తు జరిపిస్తాం. ఉగ్రవాదులు గోప్యత హక్కును కోరకూడదు. అయితే, సామాన్య పౌరుల గోప్యతకు మేం తప్పకుండా రక్షణ కల్పిస్తాం'' అని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ''ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది'' అని పేర్కొంది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. ''దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ.. వీధుల్లో చర్చించుకునే ఓ డాక్యుమెంట్‌గా ఈ నివేదిక మారకూడదు'' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

### పెగాసస్ దుమారం ఏంటీ

ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూప్ అనే సంస్థ 'పెగాసస్' స్పైవేర్‌ని అభివృద్ధి చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను ఎన్ఎస్ఓ పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పని చేసే సంస్థలకు విక్రయిస్తుంటుంది. అయితే, ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. భారత్ నుంచి 300 మంది ఫోన్లు హ్యాక్ అయినట్లు పేర్కొంది. వీరిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నట్లు తెలిపింది. దీంతో ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పెగాసస్‌పై విచారణకు ఆదేశించిన సుప్రీం.. ముగ్గురు సభ్యులతో స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక రూపొందించింది.

EDITORIAL సంపాదకీయం

# ప్రీరిలీజ్ ఈవెంట్‌లా బీఆర్ఎస్ సభ..!!

**కేసీఆర్ ప్రసంగం వచ్చే ఎన్నికల కోసం పార్టీ ఎజెండా, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తుందని అందరూ ఆశించారు. కానీ, ఆయన ప్రసంగం కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రదాత శ్రీమతి సోనియా గాంధీపై విషపూరిత విమర్శలతో నిండిపోయింది. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని 'నకిలీ గాంధీలు' అని పిలవడం కేసీఆర్ దుస్సాహసానికి నిదర్శనం.**





- అమరవాజీ నాగరాజు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సిల్వర్ జూబ్లీ వేడుకలు తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక గుర్తుండిపోయే సంఘటనగా నిలిచిపోతాయని ఆ పార్టీ నాయకులు జబ్బలు చరుచుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటనలతో హోరెత్తించారు. కానీ, ఈ వేడుకలు ఊరించి ఉసురుమనిపించినట్టు సాగాయి. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా జనాలను తరలించాలని ప్రయత్నించిన బీఆర్ఎస్ శ్రేణుల ప్రయత్నం ఫలవంతం కాలేదు. పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగం ఆ పార్టీ కార్యకర్తలకే నిరాశ, నిస్పృహలకు గురి చేసింది. ఆ ప్రసంగం ఆద్యంతం పాత చింతకాయ పచ్చడిలా రొటీన్‌గా, జీర్ణించుకోలేని విధంగా సాగిందని బీఆర్ఎస్ శ్రేణులే చప్పడాన్ని బట్టి, ఈ సభ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

సభా వేదికపై కేసీఆర్, కేటీఆర్ ఫోటోలు మాత్రమే కనిపించడం బీఆర్ఎస్‌లో అంతర్గత రాజకీయ కలహాలను స్పష్టం చేసింది. ఈ సభ బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందనే వాదనకు బలం చేకూర్చింది. కేసీఆర్ తన రాజకీయ వారసుడిగా కేటీఆర్‌ను మాత్రమే చూస్తున్నారని, కవిత, హరీష్ రావులు తమ దారి తాము చూసుకోవాలని స్పష్టమైంది. సభ మధ్యలోనే కవిత వెళ్లిపోయారనే వార్తలు, హరీష్ రావు రాజకీయ భవిష్యత్తు అస్పష్టంగా మారిందనే చర్చలు ఈ సభ ఫలితంగా బయటపడ్డాయి. ట్రబుల్ షూటర్‌గా పేరుగాంచిన హరీష్‌రావు పరిస్థితి ఇక తన దారి తాను చూసుకోవాలని పరోక్షంగా సభా స్థలంలో ఫొటోలు, కేసీఆర్ వ్యవహరించిన తీరు స్పష్టం చేసింది.

కేసీఆర్ ప్రసంగం వచ్చే ఎన్నికల కోసం పార్టీ ఎజెండా, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తుందని అందరూ ఆశించారు. కానీ, ఆయన ప్రసంగం కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రదాత శ్రీమతి సోనియా గాంధీపై విషపూరిత విమర్శలతో నిండిపోయింది. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని 'నకిలీ గాంధీలు' అని పిలవడం కేసీఆర్ దుస్సాహసానికి నిదర్శనం. కాంగ్రెస్ బిక్షతో ముఖ్యమంత్రి అయిన సంగతిని మరచి, గాంధీ కుటుంబంపై విమర్శలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనాన్ని తెలియజేస్తోంది. ఈ విమర్శలను తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించింది. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి వెళ్లి, తాను ఏదో చేసినట్టు గొప్పలు చెప్పుకున్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పులు, అప్పుల వల్ల రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదిన్నర పట్టింది. మహిళల మనసు గెలుచుకున్న ఉచిత బస్సు ప్రయాణం పథకంపై కేసీఆర్ విషం కక్కి, తెలంగాణ ఆడబిడ్డలను అవమానించారు. ఆయన నియంతృత్వ పాలనలో రాష్ట్రంలో అనేక పౌర సంఘాలు హక్కులకోల్పోయారు. అయినా తన కేసీఆర్ తన తప్పు తెలుసుకోకుండా... ఇంకా నియంతృత్వ ధోరణిలోనే సాగుతున్నారు. పార్టీ అధినేత తప్ప ఇంకెవరూ సభలో మాట్లాడకపోవడం ఆయన నియంతృత్వ మనస్తత్వానికి నిదర్శనం.

> **తెలంగాణ ఉద్యమ జెండాను దించితే రాళ్లతో కొట్టి చంపాలని గర్జించిన కేసీఆర్, పార్టీ పేరు నుంచి 'తెలంగాణ' పదాన్ని తొలగించినప్పుడు ఆ ఉద్యమ స్ఫూర్తిని మరచిపోయారు. అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల సమరం గురించి ఈ సభలో ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం బీఆర్ఎస్ ఉద్యమ విలువలకు దూరమైందనడానికి నిదర్శనం.**

> **బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ 15 నెలల్లో చేసి చూపింది. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్‌కు ప్రజలు ఎప్పటికీ క్షమించరు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు గోదారిలో పోసినట్లైంది. రుణమాఫీ, ఉద్యోగాలు, రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం, ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్ చేస్తానన్న హామీలు ఎక్కడ?**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లుగా తెలంగాణకు అన్యాయం చేస్తున్నా, కేసీఆర్ ఆ పార్టీపై సున్నితమైన విమర్శలతో సరిపెట్టారు. ఈ సభ బీజేపీబీఆర్ఎస్ రహస్య మైత్రిని మరోసారి బయటపెట్టింది. ఎన్నికల సమయంలో బీజేపీకి పరోక్షంగా సహకరించడం, ఎన్నికల తర్వాత రెండు పార్టీలూ ఒకరిపై ఒకరు నీచమైన విమర్శలు చేసుకోవడం బీఆర్ఎస్‌బీజేపీల పరిపాటిగా మారింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో బీజేపీకి సాగిలపడి, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. నిధులు తీసుకుకురావడంలో విఫలమయ్యారు. తెలంగాణ ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందకుండా చేశారు. అవినీతి, అక్రమ కేసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీ మోచేతి నీళ్లు తాగడం ఆయనకు అలవాటుగా మారింది. పార్లమెంటు ఎన్నికల్లో బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టి బీజేపీకి మేలు చేసి గురు దక్షణం చెల్లించుకున్న కేసీఆర్ బీజేపీని విమర్శించడం హాస్యాస్పదంగా మారింది.

తెలంగాణ ఉద్యమ జెండాను దించితే రాళ్లతో కొట్టి చంపాలని గర్జించిన కేసీఆర్, పార్టీ పేరు నుంచి 'తెలంగాణ' పదాన్ని తొలగించినప్పుడు ఆ ఉద్యమ స్ఫూర్తిని మరచిపోయారు. అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల సమరం గురించి ఈ సభలో ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం బీఆర్ఎస్ ఉద్యమ విలువలకు దూరమైందనడానికి నిదర్శనం. గజ్జె కట్టిన గద్దర్‌ను అవమానించిన చరిత్ర, ఉద్యమకారులను, తెలంగాణ కోసం పని చేసిన మేధావులను, కవులను, కళాకారులను పక్కనపెట్టి నియంతృత్వ పాలన చేసిన కేసీఆర్ ఆయన రాజకీయ దోపిడీని స్పష్టం చేస్తోంది.


కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన వినూత్న పథకాలు, చారిత్రాత్మక నిర్ణయాలైన బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్ట సవరణలపై కేసీఆర్ నోరు మెదపలేదు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ 15 నెలల్లో చేసి చూపింది. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్‌కు ప్రజలు ఎప్పటికీ క్షమించరు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు గోదారిలో పోసినట్లైంది. రుణమాఫీ, ఉద్యోగాలు, రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం, ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్ చేస్తానన్న హామీలు ఎక్కడ?

తెలంగాణ ప్రజల తరపున కేసీఆర్‌ను సూటిగా అడుగుతున్నాం అంబాసిడర్ కార్లలో డీజిల్ పోసుకునేందుకు డబ్బులు లేని రోజులు గుర్తున్నాయా? ఇప్పుడు అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? అదంతా తెలంగాణ ప్రజల నుంచి దోచుకున్న డబ్బు కాదా? కాళేశ్వరం పేరుతో లక్షా 25 వేల కోట్లు దోచుకున్నారు కదా? మీ ఇంట్లో నలుగురికి రాజకీయ పదవులు ఇచ్చుకున్న మీరు, అమరవీరుల కుటుంబాలకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? రుణమాఫీపై బహిరంగ చర్చకు సిద్ధమా ? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ముస్లిం రిజర్వేషన్లపై మీ వైఖరి ఏంటి? వక్ఫ్ చట్ట సవరణలను ఎందుకు వ్యతిరేకించడం లేదు? ఇవేం చెప్పడకుండా... కేవలం కాంగ్రెస్ మీద నిందలు వేయడానికే బీఆర్ఎస్ ఈ సభ పెట్టుకుంది.

మొత్తంగా, బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లా స్వంత డబ్బా కొట్టుకోవడానికి జరిగినట్లు అనిపించింది. జనాల కంటే విస్కీ సీసాలు ఎక్కువ కనిపించాయని, మహిళలు సభకు రాలేదని ప్రజలే చర్చించుకుంటున్నారు. బీజేపీబీఆర్ఎస్ రహస్య ప్రేమను ఈ సభ మరోసారి బయటపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్న ఈ రెండు పార్టీల ఉద్దేశాలను ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకున్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలను గుర్తుంచుకుని, కాంగ్రెస్ అభివృద్ధి పనులను చూసి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం.

# భూతాపం లేని భూమి కావాలి





- పిన్నింటి బాలాజీ రావు
భౌతికరసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు
9866776286

భూగోళం ఉష్ణోగ్రత ఏటికేడు విపరీతంగా పెరుగుతున్నది.ఇలా అయితే మానవ మనుగడ కష్టమేనని,ఉష్ణోత్రలు పెరిగితే చాలా దుష్ప్రభావాలు వస్తాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**అతిపెద్ద ఆరోగ్య ముప్పు**

ఇప్పుడు మనకు ఎదురవుతున్న వాతావరణ మార్పును '21వ శతాబ్దపు అతిపెద్ద ప్రపంచ ఆరోగ్య ముప్పు' గా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. ఇది మనందరిపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు, పేదలపై దీని ప్రభావం ఎక్కువ. అది ప్రత్యక్ష, పరోక్ష మార్గాల్లో ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ అనారోగ్యానికి గురవుతారు కాబట్టి అత్యవసర వైద్య సేవలు అవసరం అవుతాయి. మరణాలు సంభవించే ప్రమాదం ఉండడమే కాదు మరణాల సంఖ్యా పెరుగుతుంది.

**నాసా హెచ్చరిక**

వాతావరణ మార్పులతో భూగోళం వేడెక్కుతోందని, హిమనదాలు, హిమ ఫలకాలు కరిగి నీరవుతున్నాయని నాసా డేటా పేర్కొంటోంది. దీంతో అంటార్కిటికాలో సగటున ఏటా దాదాపు 15వేల కోట్ల టన్నుల మంచు కరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న గ్రీన్ హౌస్ వాయువుల వల్ల భూగోళంపై సగటు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి

**పెరుగుతున్న సముద్ర మట్టం**

2100 నాటికి ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టం కనిష్టంగా 28 సెంటీమీటర్ల నుంచి గరిష్టంగా 98 సెంటీమీటర్ల వరకూ పెరుగుతుందని ఐపీసీసీ అంచనా. గ్రీన్‌ల్యాండ్ మంచు దుప్పటి పూర్తిగా కరిగితే సముద్ర మట్టం ఏకంగా 7 మీటర్లు పెరుగుతుంది. అదే జరిగితే బ్రిటన్ రాజధాని లండన్ నగరం సముద్రంలో మునిగిపోతుంది. సముద్ర మట్టం ఒక మీటరు పెరిగితే భారత తీరంలో 13,973 చదరపు కిలోమీటర్ల భూభాగం సముద్రంలో మునిగిపోతుందని అంచనా.

**ఐపిసిసి నివేదిక**

భూతాపం పెరిగి ధ్రువాల్లో మంచు దుప్పటి కరిగిపోతుండడం, వాతావరణం వేడెక్కడం వల్ల సముద్ర జలాలు కూడా వేడెక్కి వ్యాకోచించడం, ప్రపంచవ్యాప్తంగా గల గ్లేసియర్లు కరుగుతుండటంతో సముద్ర మట్టాలు పెరుగు తున్నాయి. 19012010 మధ్య ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టం సగటున 19 సెంటీమీటర్ల మేర పెరిగినట్లు వాతావరణ మార్పులపై ప్రపంచ సంఘం (ఐపీసీసీ) ఐదో అంచనా నివేదిక ఇటీవల తెలిపింది.

**గ్లోబల్ వార్మింగ్ తో పెనుముప్పు**

గ్లోబల్ వార్మింగ్‌తో భూగోళం వేడెక్కుతోంది. భూగోళంపై ఉష్ణోగ్రత పెరగడాన్ని భూతాపం (గ్లోబల్ వార్మింగ్)గా అభివర్ణిస్తున్నారు. భూగోళం ఉష్ణోగ్రత పారిశ్రామీకరణ ముందు నాటికన్నా ఇప్పుడు ఒక డిగ్రీ సెల్సియస్ పెరిగింది. దీనివల్ల ధ్రువ ప్రాంతాల్లోని మంచు ఖండాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న గ్లేసియర్లు కరుగుతూ ఆ నీరు సముద్రాల్లోకి వచ్చి చేరుతోంది ప్రస్తుతం అంతరించిపోతున్న అడవులు జీవ వైవిధ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయి. అడవులు అక్రమార్కుల చేతిలో పడి నాశనం అవుతున్నాయి.

**శిలాజ ఇంధనాలతో భూతాపం**

బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తుల వంటి శిలాజ ఇంధనాలను అంతకంతకూ అధికంగా వాడడం వల్ల భూతాపం పెచ్చు మీరిపోతున్నది. భూమ్మీద ప్రాణుల జీవనాన్ని నానాటికీ దుర్భరంగా మార్చుతోంది.

**ఉధృతమవుతున్న ప్రకృతి వైపరీత్యాలు**

ప్రకృతి వైపరీత్యాలు ఏటేటా ఉధృతం అవుతున్నాయి. ప్రకృతి వనరుల విధ్వంసం అప్రతిహతంగా జరుగుతోంది.అమితంగా వేడెక్కిన వాతావరణం ఎక్కువ నీటిని పట్టుకుని, ఒకేసారి కుంభవృష్టిగా వదిలేయడంతో మనం చూస్తున్న కరువులు, తీవ్రమైన తుపాన్లు, వరదలు ఏర్పడుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి, భద్రతకు, ఉనికికి ఈ పరిణామాలు ప్రమాదకరం.జీవజాతులు 114 రెట్లు వేగంగా అంతరించిపోతున్నాయి.

**వ్యాధులతో జనజీవనం అస్తవ్యస్తం**

మనుషులకు అంతకు ముందెన్నడూ ఎరుగని భీకర వ్యాధులు సోకుతూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి.ఏటా సంభవించే తుపాన్లు, టోర్నడోలు, వరదలు, పిడుగుల వంటివాటి కంటే విపరీతమైన వేడి వల్లే ఎక్కువ మంది చనిపోతున్నారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారత దేశంలో వేడి వాతావరణం సాధారణమే అయినా, ఉష్ణోగ్రతల్లోని మార్పుల పర్యవసానంగా వీచే వడగాడ్పుల వల్ల నీడలేని పేదలు చనిపోవడం సాధారణం అయింది.

**వన్యప్రాణులకు హాణి**

భూతలం మీద, సముద్రంలో జరుగుతున్న వేగవంతమైన వాతావరణ మార్పులు మానవేతర ప్రాణులకు కూడా ముప్పు తెచ్చిపెడుతున్నాయి.అధిక ఉష్ణోగ్రతలకు వన్య ప్రాణులు చనిపోతున్నాయి. భూమిపైన,మంచినీటి సరస్సులలో ఉండే జీవాలు, సముద్ర జాతులు అధిక ఉష్ణోగ్రతల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో, సాధ్యమైనంత వరకు తమ భౌగోళిక పరిధులను వదిలి చల్లని లేదా ఎత్తయిన ప్రాంతాలకు వలస పోతున్నాయి.

**అంతరిస్తున్న అడవులు**

నేడు పట్టణీకరణ, వ్యవసాయం, ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహ వినియోగం వంటి కారణాలతో అడవులు అంతరించి పోతున్నాయి .ఈ పరిస్థితి జీవుల మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు సవాలుగా మారుతోంది.

**గ్రీన్ హౌస్ ఉద్గారాలు తగ్గించాలి**

భూతాపంవల్ల కలిగే ప్రమాదాల గురించి ఐక్యరాజ్య సమితి తరచుగా హెచ్చరిస్తూనే ఉంది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను సమీప భవిష్యత్తులో వేగంగా తగ్గించకుంటే, భూ వినియోగ విధానాలను మార్చకపోతే, ప్రపంచంలో ఏ దేశమూ పెరుగుతున్న ఈ ప్రమాదాల నుంచి తప్పించుకోలేదు. భారత్, చైనా వంటి దేశాలు ప్రపంచంలోని ఇతర దేశాల కంటే ఎక్కువ ప్రమాదంలో ఉన్నాయని అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. ఆహారం, నీటి కొరత ఏర్పడవచ్చు.


**మొక్కలు పెంచి కాలుష్యం తగ్గించాలి**

మొక్కలు పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడమే మనముందున్న లక్ష్యం.తద్వారా కొంతమేరకు భూతాపం తగ్గించవచ్చు. సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం, సస్యశ్యామలాం మాతరం వందే మాతరం... అని నిత్యం నినదించే మనం భవిష్యత్ తరాలకు భూతాపం లేని భూమిని అందించాలి. మన నేలతల్లిని మనమే కాపాడుకునేందుకు సిద్ధం కావాలి. మన పూర్వీకులు అందించిన స్వచ్ఛమైన గాలి, నీరు, నేలను యధావిధిగా ముందు తరాలకు అందించడం తమ బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలి. పరిశుభ్రత, పచ్చదనంతో కూడిన భూతాపం లేని ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు పునరంకితం కావాలి.

# భారత్ తగ్గేదేలే

## పాకిస్థాన్ కన్నా సైనిక అవసరాల కోసం 9 రెట్లు ఎక్కువ ఖర్చు

### ప్రపంచంలోనే అత్యధికంగా ఖర్చు చేసిన దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానం.. సిప్రి నివేదిక



**(మహా ప్రత్యేకం):** సైనిక ఖర్చులో భారత్ ఎపుడూ తగ్గేదెలే అంటోంది. ప్రపంచంలోనే అత్యధికంగా సైనిక చర్యల కోసం ఖర్చు చేసే దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉంది. హల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ స్వీడన్‌కు చెందిన మేధోసంస్థ స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదికలో కీలక విషయం వెల్లడైంది. 2024లో భారత సైనిక వ్యయం పాకిస్థాన్ కంటే దాదాపు 9 రెట్లు ఎక్కువని తేలింది. 2023 కంటే భారత్ సైనిక వ్యయం 1.6శాతం పెరిగి 86.1 బిలియన్ డాలర్లకు చేరుకోగా, పాకిస్థాన్ 10.2 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడైంది.

**సిప్రి నివేదిక ప్రకారం లెక్క ఇదే**

సైనిక అవసరాల కోసం ప్రపంచంలోనే అత్యధికంగా ఖర్చు చేసిన దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉంది. ప్రపంచంలో ఎక్కువ సైనిక వ్యయం చేస్తున్న దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉంది. అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, వరుసగా చైనా, రష్యా, జర్మనీ రెండు, మూడు, నాలుగో ప్లేస్‌లో నిలిచాయి. ప్రపంచదేశాల సైనిక వ్యయం 1,635 బిలియన్ డాలర్లు కాగా, ఈ ఐదు దేశాలే అందులో 60శాతం ఖర్చు చేస్తున్నాయి.

**ఖర్చు పెంచేస్తున్న చైనా**

చైనా సైనిక వ్యయం 7 శాతం పెరిగి 314 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఆసియా దేశాల మొత్తం సైనిక వ్యయంలో చైనానే 50శాతం వాటా కలిగి ఉంది. సైనిక ఆధునీకరణ, సైబర్ వార్‌ఫేర్ సామర్థ్యాలు, అణ్వాయుధాల విస్తరణ కోసం డ్రాగన్ భారీగా ఖర్చు చేస్తోంది.

**పెరిగిన ఉక్రెయిన్ సైనిక వ్యయం**

యూరప్‌లో (రష్యాతో సహా) సైనిక వ్యయం 17 శాతం పెరిగి 693 బిలియన్లకు చేరుకుంది. ఉక్రెయిన్‌రష్యా యుద్ధం వల్ల యూరప్ అంతటా సైనిక వ్యయం పెరుగుతూనే ఉంది. ఉక్రెయిన్ సైనిక వ్యయం 2.9 శాతం పెరిగి 64.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దేశ జీడీపీలో ఇది 34 శాతం.

**రష్యా సైనిక వ్యయం ఎంతంటే?**

2024లో రష్యా సైనిక వ్యయం 149 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది రష్యా జీడీపీలో 7.1 శాతం. 2023తో పోలిస్తే 2024లో రష్యా సైనిక వ్యయం 38 శాతం పెరిగింది. 2015లో కంటే డబుల్ అయ్యింది. "రష్యా మరోసారి తన సైనిక వ్యయాన్ని గణనీయంగా పెంచింది. ఉక్రెయిన్‌తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. ఉక్రెయిన్ ప్రస్తుతం తన పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని సైన్యం కోసం కేటాయిస్తోంది. ఇంత ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ ఉక్రెయిన్ తన సైనిక వ్యయాన్ని పెంచుతూనే ఉండటం సవాలుగా ఉంది." అని సిప్రీ పరిశోధకుడు యెగో లోప్స్‌డా సిల్వా తెలిపారు.

**భారీగా సైనిక వ్యయాన్ని పెంచిన జర్మనీ**

జర్మనీ సైనిక వ్యయం 28 శాతం పెరిగి 88.5 బిలియన డాలర్లుకు చేరుకుంది. మధ్య, పశ్చిమ ఐరోపాలో ఎక్కువ మొత్తంలో సైనిక వ్యయం చేసే దేశంగా నిలిచింది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఖర్చుదారుగా నిలిచింది. పోలాండ్ సైనిక వ్యయం 31 శాతం పెరిగి 38 బిలియన్లకు చేరుకుంది. ఇది ఆ దేశ జీడీపీలో 4.2 శాతమని సిప్రీ తెలిపింది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.


మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# నిషేధిత జాబితా నుంచి మా భూమిని తొలగించండి

## బాధిత యువ రైతు వుల్లింతల జీవన్

### చెట్టుకు తలకిందకు వేలాడుతూ వినూత్న నిరసన

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రెవెన్యూ అధికారుల తప్పిదాల వల్ల, గత కొన్ని రోజులుగా ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో వినూత్న నిరసన తెలిపాడు. ఇబ్రహీంపట్నం మండలం మంగళ్ పల్లి పటేల్ గూడకు చెందిన వుల్లింతల జీవన్ అనే వ్యక్తికి సర్వే నంబర్ 374లో 1ఎకరా 32 గుంటలు భూమి తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చింది. ఆ భూమిని 20 ఏళ్ల కిందట తన తండ్రి ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి కొత్త పాస్ బుక్, పాత పాస్ బుక్, టైటిల్ డీడ్, పహానీ పత్రాలు అన్నీ ఉన్నా గతంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పులతో సీలింగ్ హోల్డర్ లో ఉన్న సర్వే నంబర్ లో పడింది. ప్రస్తుతం ఈ భూమిని అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారనీ జీవన్ వాపోయాడు. అధికారులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగిన సమస్యకు పరిష్కారం దొరుకడం లేదనిచెప్పారు. ఇదిలా ఉండగా అసలు సీలింగ్ హోల్డర్ రెండు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించాడని, దీనిపై పూర్తి ఆధారాలతో రెవెన్యూ శాఖకు, కలెక్టర్, తహశీల్దార్, ఆర్డీవో ఆఫీసులకే గాక ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా వందకు పైగా లేఖలు రాసినా స్పందన కరువైందని బాధితుడు తెలిపాడు. ఇలా సంవత్సరం పాటు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విన్నవించుకున్న ఫలితం లేకపోవడంతో వాపోయాడు. ఈ



భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి, పట్టా భూమిగా తనకు తిరిగి ఇప్పించాలని అంటున్నారు. ఇక దీనిపై తనకు న్యాయం చేయాలని కోరుతూ.. తన భూమిలోనే ఉన్న వేప చెట్టుకు భూమి పత్రాలను కట్టడంతో పాటు అదే చెట్టుకు తాను కూడా తలకిందులుగా వేలాడుతు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. దీనికి సంబంధించిన వీడియోను తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో కాస్త నెట్టింట వైరల్ గా మారింది. గతంతో కూడా బాధితుడు ఎమ్మార్వో కార్యాలయంలో తలకిందుకే కాలు మీదికి చేసి నిరసన తెలిపాడు. అయినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు. ఎమ్మార్వో మాత్రం తనకేం పట్టణ పట్టనట్టుగా వ్యవహరిస్తుందని బాధితుడు వాపోయాడు. ఇది ముమ్మాటికీ రెవెన్యూ అధికారుల తప్పిదమేనని, నా సమస్యకు పరిష్కారం కల్పించాలని ఆవేదనతో రెవెన్యూ ఉన్నతాధికారులను జీవన్ వేడుకున్నాడు.

# మోగిన సమ్మె సైరన్ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

### మిషన్ భగీరథ ఈ ఈ నరసింహ గౌడ్ కు సిఐటియు వినతి పత్రం

### కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మె విజయవంతం చేయాలి

### కార్మికులపై మోడీ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి. జగదీష్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో మే 20న జరిగే దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె నోటీసు, మిషన్ భగీరథ ఇఇ నరసింహ గౌడ్ కు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి. జగదీష్, సిఐటియు యాచారం మండల కన్వీనర్ ఎస్ చందునాయక్ మాట్లాడుతూ... కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం బరితెగించి కార్పొరేట్ మతోన్మాదులకు అనుకూలంగా, పేద ప్రజలకు, కార్మికులకు వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తుందని అన్నారు. అనేక త్యాగాలు, రక్త తర్పణలతో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కాంటాక్ట్ కార్మికుల చట్టం 1970తో పాటు 29 కార్మికుల చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని మోడీ ప్రభుత్వం తహతహలాడుతుందని అన్నారు. మరో పక్క దేశ ప్రజలు కూడబెట్టుకున్న జాతి సంపదను సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను



నేషనల్ మానీటైజేషన్ పైప్ లైన్ (ఎన్ఎంపీ) పేరుతో బడా బాబులకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని అన్నారు. జాతీయ రహదారులు, విద్యుత్ స్టేషన్లు, రైలు, రైల్వే స్టేషన్లు, బొగ్గు గనులు, టెలికం టవర్లు, విమానాశ్రయాలు, ఒడరేవులు, ఎఫ్ సి ఐ గోడౌన్లు, క్రీడ మైదానాలతో సహా ప్రజా ఆస్తులన్నిటిని కార్పొరేట్లకు అమ్మేస్తుందని అన్నారు. 2025 కేంద్ర బడ్జెట్లో విద్య, వైద్యం, ఉపాధి హామీలాంటి సామాజిక సంక్షేమాలకు నిధులు తగ్గించిందని అన్నారు. నిత్యవసర వస్తువులపై అధిక పన్నులు విధిస్తూ పేదలపై బారాలు మోపిందని అన్నారు. వంట గ్యాసు, పెట్రోల్ ,డీజిల్,నూనె, పప్పులు ,కూరగాయలు అని రకాల వస్తువుల ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విడిచిందని అన్నారు. మిషన్ భగీరథ స్కీమ్లో పనిచేస్తున్న పంపు ఆపరేటర్ లైన్మెన్ ఫిల్టర్ ఎలక్ట్రీషియన్ ట్యాంక్ క్లీనర్ తదితర కేటగిరిలో పనిచేస్తున్న కార్మికులందరికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కార్మికులకు ఉరితాలుగా మారే నాలుగు లేబర్ కోట్లను రద్దు చేయాలని, కార్మికులకు ప్రభుత్వాన్ని మధ్య కంపెనీ కాంట్రాక్టర్ జోక్యం లేకుండా ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని, బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ పీఎఫ్ ఈఎస్ఐ బోనస్ వారంతపు సెలవు ఇవ్వాలని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు, ఉద్యోగ భద్రతలు కల్పించాలని కోరుతూ మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో, పని బంద్ చేసి మిషన్ భగీరథ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ యూనియన్ అధ్యక్షులు యాదయ్య, యూనియన్ రాష్ట్ర నాయకులు బాలరాజ్, యూనియన్ ఉపాధ్యక్షులు బుగ్గ రాములు, యూనియన్ సహాయ కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు



### ఆమనగల్ మార్కెట్ యార్డులో రైతులకు

# మంచినీటి సౌకర్యం కల్పించాలి

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్

**రంగారెడ్డి జిల్లా:** ఆమనగల్ మార్కెట్ కమిటీలో మంచినీటి, విద్యుత్ సమస్యలు పరిష్కారం కోసం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ ఆమనగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శంకర్ నాయక్ కు వినతి పత్రం అందజేచేయడం జరిగింది. ఆమనగల్ మార్కెట్ యార్డ్ లో తాగు నీటి సమస్య ఉందని అదేవిధంగా విద్యుత్ స్తంభాలకు వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి రైతులు ధాన్యం విక్రయాల కోసం వచ్చే వారికి కనీస మంచినీటి సమస్యను తక్షణమే కల్పించాలని, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ కమిషనర్ ను కోరారు.



### నేడే మేళ్లచెరువులో భూ భారతి

# అవగాహన సదస్సు

## తహశీల్దార్ పి.జ్యోతి

**మేళ్లచెరువు,మహా ;** మేళ్లచెరువు మండల కేంద్రంలో భూభారతి చట్టంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి.జ్యోతి తెలిపారు. శ్రీ కస్తూరి వెంకటేశ్వర కళ్యాణ వేదికలో జరిగే భూభారతి చట్టంపై జరిగే అవగాహన సదస్సుకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజాస్ నందలాల్ పవర్ పాల్గొననున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంపై జరిగే అవగాహన సదస్సుకు హుజూర్నగర్ నియోజకవర్గం అధికారులు మరియు మేళ్లచెరువు మండల రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొంటారని తహశీల్దార్ తెలిపారు. మేళ్లచెరువు మండల రైతులు ఈ యొక్క సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తహశీల్దార్ కోరారు.

# పేదలకు అండగా మన సనాతన హిందూ సేవా సమితి

## దిగ్విజయంగా 56వ సేవా కార్యక్రమం..

**హన్మకొండ, మహా;** చిన్న వయసు లోనే భర్త మృతి చెందడం తో పిల్లల పోషణ, చదువులు భారంగా మారి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కాజిపేట బాపూజీ నగర్ కు చెందిన కొల్లూరి అరుణకు అండగా నిలిచిన మన సనాతన హిందూ సేవా సమితి సభ్యులు. వీరి ద్వారా పేదరాలైన అరుణ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా బియ్యం తో పాటు నిత్యావసర సరుకుల అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మన గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, సలహాదారు ప్రతాపగిరి గణేష్, గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, వైట్ల నాగరాజు, దీకొండ అమర్నాధ్ పాల్గొన్నారు.






# లబ్ధిదారుని ఇంట్లో సన్న బియ్యం భోజనం చేసిన మంత్రి పొంగులేటి

## పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే,మేయర్, కలెక్టర్, కమిషనర్

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా జిడబ్ల్యుఎంసి పరిధిలోని బి.ఆర్ నగర్ లో సన్న బియ్యం లబ్ధిదారుల గృహంలో కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్ ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ ,దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిడబ్ల్యుఎంసి కమీషనర్ అశ్విని తానాజీ వాకాడే సహ పంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, జిల్లా సీనియర్ నాయకులు మడిపల్లి కృష్ణ, మీసాల ప్రకాష్, సయ్యద్ వసీం పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు చేయాలంటూ

## రోడ్డెక్కిన రైతులు

**కాటారం, మహా :** కాటారం మండలంలోని రేగులగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. తూకంలో కటింగ్ చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్యాడీక్లీనర్ లు అందుబాటులో ఉంచలేదని, మంథని కాటారం రహదారిపై వడ్లు పోసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం కుప్పలుగా పోసి ఎన్నో రోజులు గడిచినప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడం ఆలస్యం చేశారని రైతులు ఆరోపించారు. రైతులకు అనువైన స్థలంలో కేంద్రం ఏర్పాటు చేయలేదని, కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసేందుకు స్థలం సరిపోవడంలేదని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తూకంలో ఎలాంటి కటింగులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

# మన భారత రాజ్యాంగాన్ని హక్కులను కాపాడుకోవాలి

## రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగం పట్ల వ్యవహరిస్తున్న తీరుపై, మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఆదిభట్ల మున్సిపాలిటీ ప్రజలకు రాజ్యాంగ హక్కులను వివరించారు. అనంతరం మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపి పటేల్ గూడ, కొంగర కలాన్ గ్రామాల్లో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌని బాల్ రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి హాజరయ్యారు. మున్సిపాలిటీ ప్రజలకు గడప గడపకు తిరిగి రాజ్యాంగ హక్కులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశంలోని ప్రజలు వలస పాలకుల కబంధహస్తాల కింద నలిగిపోతున్న సమయంలో దేశ ప్రజల కోసం మహాత్మా గాంధీ ప్రాణాలను అడ్డుపెట్టి స్వతంత్రాన్ని సాధించి పెట్టారు. దేశంలోని ప్రజలను, ప్రజల యొక్క విధి విధానాలను మనుగడను దృష్టిలో పెట్టుకొని, దేశ ప్రజల కోసం, ప్రజల హక్కుల గురించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం హేళనగా చూస్తుందని, రాజ్యాంగాన్ని కాపాడుకునే అవసరం మనందరికీ ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాశం లక్ష్మీపతి గౌడ్, ఈసీ శేఖర్ గౌడ్, భూపతిగల్ల మహిపాల్, మంకాల దాసు, కొత్తకుర్మ శివకుమార్, రాచర్ల వెంకటేశ్వర్లు, కామాండ్ల యాదగిరి, పండాల శంకర్ గౌడ్, అమృత సాగర్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చిలుక రాజు, సిద్దంకి కృష్ణ రెడ్డి, పొట్టి ఐలయ్య, లక్క రాజు ప్రశాంత్, కొత్త ప్రవీణ్ గౌడ్, బంగరిగల్ల శేఖర్, నర్సింహా, రమేష్,శ్రీనివాస్ గౌడ్, అశోక్ రెడ్డి, మహేష్ గౌడ్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రికి ఘన స్వాగతం



**వరంగల్, మహా;** రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా వరంగల్ మామునూర్ హెలిప్యాడ్ వద్ద మంగళవారం చేరుకోగా గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, తదితరులు పూల మొక్కలను అందించి ఘనంగా స్వాగతం పలికారు.

### భూసమస్యల పరిష్కారానికి నిర్ణీత కాలాన్ని

# భూభారతిలో పొందుపరచాలి

## సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనున్న భూ భారతి చట్టంలో భూ సమస్యల పరిష్కారానికి నిర్ణీత కాల వ్యవధిని పొందు పరచాలని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం ఎంబీఏ గార్డెన్ లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరయ్యారు. భూభారతి చట్టంపై అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిలకు పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ లతో కలిసి వినతి పత్రం అందజేశారు. భూభారతి చట్టంలో గ్రామాల వారీగా ఉన్న చెరువులు, కుంటల యొక్క వివరాలు, వాస్తవిక చెరువుల నక్షలు మరియు ప్రభుత్వ, అసైన్డ్ భూముల యొక్క పూర్తి వివరాలు పొందుపరచాలని కోరారు. ఈ వివరాలను పొందుపరచడంతో గ్రామాలలో భూతగాదాలు అరికట్టవచ్చని అన్నారు. అదేవిధంగా భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి ద్వారా స్వీకరిస్తున్న దరఖాస్తుల



యొక్క పరిష్కార సమయాన్ని కూడా అందులో పొందుపరచాలని కోరారు. రెవిన్యూ అధికార వికేంద్రీకరణ జరిగినా సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందని కలెక్టరుకు వివరించినట్లు పేర్కొన్నారు. భూసమస్యల పరిష్కారానికి జీవో నెంబర్ 29, అనుబంధం ఏ లో పొందుపరిచిన సమర్ధ అధికారంతో పాటుగా నిర్ణీత కాల వ్యవదిని పొందు పరచాలని కోరినట్లు తెలిపారు. బీదర్ నుండి మహేశ్వరం వరకు నిర్మిస్తున్న నూతన 765 కేవీ హై టెన్షన్ నిర్మాణంతో నష్టపోతున్న రైతులకు ప్రస్తుతం నిర్ణయించిన పరిహారాన్ని పెంచాలని బాధిత రైతులతో కలిసి వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.



### ఆర్టిఐ మండల అధ్యక్షుడిగా

# ఉపేంద్ర ఎన్నిక

**మేళ్లచెరువు, మహా:** సూర్యాపేట జిల్లా సమాచార రక్షణ హక్కు చట్టం 2005,మేళ్ళచెరువు నూతన మండల అధ్యక్షులుగా అన్నేపంగు ఉపేంద్రను నియమిస్తున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపాటి సందీప్ తెలిపారు. అందజేశారు ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది భారత పౌరులకు ప్రభుత్వ సమాచారాన్ని పొందే హక్కును కల్పించే చట్టం 2005లో ఆమోదించబడినదని.. ప్రభుత్వ పారదర్శకతను జవాబు దారితనాన్ని మరియు అవినీతిని అరికట్టేందుకు ఉపయోగపడుతుంది. సమాచారం యొక్క ముఖ్య లక్షణాలు పౌరులకు సమాచారం తెలిస్తే వారు ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించగలుగుతారు. వారి హక్కులను కాపాడుకోగలుగుతారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ పనితీరులో పారదర్శకత పెరుగుతుంది. ప్రజలకు సమాచారం అందుబాటులోకి వస్తుంది అని వారు చెప్పుకొచ్చారు, ఈ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా సమాచార హక్కు చట్టం కార్యదర్శి ఏడుకొండలు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ళ కోసం

# అర్హులైన పేదలను గుర్తించండి

## స్పెషల్ సెక్రెటరి హౌసింగ్ డిపార్ట్మెంట్ విపి గౌతమ్ ఐఏఎస్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇందిరమ్మ ఇళ్ళ కోసం అర్హులైన ఇల్లు లేని నిరు పేదలను గుర్తించాలని స్పెషల్ సెక్రెటరి హౌసింగ్ డిపార్ట్మెంట్ విపి గౌతమ్ ఐఏఎస్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా తుక్కుగూడ మున్సిపాలిటీలో మంగళవారం 8వ వార్డ్ మంఖాల్,10వ వార్డు తుక్కుగూడ, మహేశ్వరం మండలం, సిరిగిరిపూర్ గ్రామంలో, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల యొక్క ఎంపిక జరుగుతున్న తీరు మరియు ఇంత వరకు సేకరించిన లబ్ధిదారుల వివరాలు ఇంటింటికి తిరిగి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా స్పెషల్ సెక్రెటరి లబ్దిదారులతో మాట్లాడం జరిగినది. ఇట్టి పరిశీలనలో లబ్దిదారుల యొక్క కుటుంబ ప్రస్తుత నివాస స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితులు మరియు లబ్దిదారుల ఎంపిక వివరాల గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ సెక్రెటరి విపి గౌతమ్ ఐఏఎస్ మాట్లాడుతూ... నిజమైన లబ్దిదారులని ఇంటి దగ్గరే అధికారులు వచ్చి వాళ్ళ వివరాలను సేకరించి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అర్హులైన ఇల్లు లేని పేద వారిని గుర్తించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ ఐఏఎస్ (ఎల్బిఎస్) పాల్గొని మాట్లాడుతూ... ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఖచ్చితమైన సర్వే చేసి ప్రభుత్వానికి మరియు జిల్లాకి మంచి పేరు తీసుక రావాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమలో హౌసింగ్ రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ధరావత్ చంప్లా నాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ ఎ వాణి, మహేశ్వరం మండలం తాసిల్దార్ టి సైదులు, మహేశ్వరం మండలం ఎంపీడీఓ కె శైలజ రెడ్డి, వెరిఫికేషన్ ఆఫీసర్ రామ్ ప్రసాద్ వెరిఫికేషన్ ఆఫీసర్ మరియు మునిసిపల్, మండల సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్ట్ సమస్యలను పరిష్కరించండి

## వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రిని కలిసిన టీ యుడబ్ల్యూజె జిల్లా కమిటీ నాయకులు




**వరంగల్ మహా;** టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జర్నలిస్టుల ప్రధాన సమస్యల పరిష్కారం గురించి మంగళవారం వినతి పత్రం అందజేశారు . వరంగల్ ఉరుసు గుట్ట సమీపం లోని నాని గార్డెన్స్ లో జరిగిన భూభారతి పై ప్రజలకు అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డినీ టీ యు డబ్ల్యూజే (ఐ జే యు) జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్ ,ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్,జిల్లా కమిటీ బాధ్యులు మంత్రిగారిని కలిసి జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను, ఇళ్ల స్థలాలను వరంగల్ జిల్లా లోని వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు.

# విశ్రాంత జీవితం, ప్రశాంతంగా గడపాలి



## జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

**కాటారం, మహా :** ఉద్యోగులు పదవి విరమణ అనంతరం విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. టేకుమట్ల పోలీసు స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తూ, మంగళ వారం పదవి విరమణ పొందిన ఏఎస్ఐ పింగళి అమరేందర్ రెడ్డి నీ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరే పూలమాలవేసి, శాలువాతో సత్కరించి, గృహపకరణాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా పూర్తి చేసి పదవి విరమణ పొందడం గొప్ప విషయం అన్నారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నగేష్, రత్నం, కిరణ్, శ్రీకాంత్, అమరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**వరంగల్ మహా;** చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో స్వయం వ్యక్తమై దర్శింప వచ్చిన భక్తుల పాలిట కోరిన కోర్కెలకు కొంగు బంగారముగుచూ పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో 29042025 నుండి 10052025 వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహింపబడే శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. ఉదయం 400లకు అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి ఉత్సవాంగీకార ప్రార్ధన జరిపారు. అనుజ్ఞ లభించిన వెంటనే అమ్మవారికి బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా ముందుగా గణపతి పూజ, పుణ్యహవాచనం, నాంది, ఇడాహవాచనం, బ్రహ్మకూర్చహెూమం, పంచగవ్య ప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్కవిధి జరిపి వాస్తుయాగం, పర్యగ్నికరణం, మృత్సంగ్రహణం, ధ్వజాధివాస కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి ఉదయం గణపతి సేవను, సాయంకాలం శ్రీ సుబ్రహ్మణ్య సేవ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ప్రతిసర బంధం, ఉదకశాంతి నిర్వహించి రక్షోఘ్న హెూమం అనంతరం బ్రహ్మోత్సవ అంకురార్పణ జరిపి సాయంత్రం పూజ నిర్వహించారు. ఈ అంకురార్పణ కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయానికి విచ్చేసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు వందలాదిగా వరంగల్ జిల్లా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య నేతృత్వంలో మేళతాళాలతో పట్టుచీరలు, పూజాద్రవ్యాలు అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆలయ కార్యనిర్వహధికారి శేషు భారతి తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన షాద్‌నగర్ వీర్లపల్లి ఎమ్మెల్యే శంకర్





**షాద్ నగర్, మహా:** రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. రైతులు కష్టించి పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆయన సూచించారు. మంగళవారం షాద్‌నగర్ మార్కెట్ యార్డ్‌లో కొందుర్గు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన హితవు పలికారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణా, హమాలీ ఛార్జీలు మరియు గోనె సంచుల కొరత లేకుండా చూడాలని సూచించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ అధిక దిగుబడినిచ్చే పంటలు సాగు చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, కొందుర్గ్ మరియు ఫరూఖ్‌నగర్ ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు బక్కన్న యాదవ్, దామోదర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మల్లేష్, కరుణాకర్, భాస్కర్, నవీన్, భరత్, రవినాయక్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, అగ్గనూర్ బస్వం, ఇబ్రహీం, బాలరాజు గౌడ్, సుదర్శన్ గౌడ్, హరినాద్ రెడ్డి, నర్సింలు, కుమారస్వామి గౌడ్, చంద్రశేఖర్, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్, కొమ్ము కృష్ణ, మహబూబ్ షరీఫ్, రఘునందన్ సుదర్శన్, అనిల్, గంగమోని సత్తయ్య మరియు పలువురు ముఖ్య నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాలను అడ్డుకున్న మాడుగుల పోలీసులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న పోలీసులు. మాడుగుల పోలీసు మంగళవారం బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో గస్తీ నిర్వహిస్తుండగా, ఒక ట్రాక్టర్ అనుమానస్పదంగా వాళ్లకు ఎదురుగా రావడంతో, ట్రాక్టర్ను ఆపి పరిశీలించగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించారు. డ్రైవర్ను విచారించగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను నల్లచెరువు వాగు నుంచి దొంగతనంగా తీసుకొస్తున్నామని తెలిపాడు. మాడుగుల మండలం, నల్లచెరువు గ్రామానికి చెందిన వరికుప్పల శివ, ట్రాక్టర్లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా, మాడుగుల పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాడుగుల సిఐ తెలిపారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని నక్కకు గాయాలు

**కేశంపేట రైతు వేదిక వద్ద చోటు చేసుకున్న ఘటన...**

**షాద్ నగర్ ,మహా:** గుర్తుతెలియని వాహనం ఢీకొని అడవి జంతువు నక్కకు తీవ్ర గాయాలైన సంఘటన రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం పరిధి కేశంపేట మండల కేంద్రం వద్ద ఉన్న రైతు వేదిక సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని నక్కకు తీవ్ర గాయాలు అయినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆమనగల్ వెటర్నరీ హాస్పిటల్ కు తరలించి మెరుగైన వైద్యం అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బల్దియా ప్రజావాణిలో పరిష్కారాలు అంతంత మాత్రమేనా?

**నెలలు గడిచిన ఫిర్యాదులను పట్టించుకునే నాథుడే కరువు**

**కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోని కొంతమంది అధికారులు**

**పరిష్కారాలు చూపక పేరుకు పోయిన ప్రజా సమస్యలు**

**వరంగల్, మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కేవలం దరఖాస్తులు స్వీకరించడానికే పరిమితమవుతోంది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలల తరబడి కాలం గడుస్తున్న వాటిని పట్టించుకునే నాథుడే కరువైతున్నట్లుగా పలువురు బాధితులు విమర్శిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో మొత్తం 66 డివిజన్ లలో ఇంజనీరింగ్, ఆరోగ్య, శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మంచినీటి సరఫరా, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, డిఆర్ఎఫ్ మొదలగు సమస్యలపై కమిషనర్ ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాకపోవ దంతో గ్రేటర్ మున్సిపాలిటీపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది.

**బల్దియాలో పేరుకుపోతున్న ప్రజావాణి ఫిర్యాదులు**

దాదాపు అన్ని విభాగాలతో కలిపి దాదాపు 80 నుండి 120 వరకు ఫిర్యాదులు అందుతున్నా అధికారులు వాటి పరిష్కారాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులలో నిబద్ధత కొరవడటంతో బల్దియాలో ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా పేరుకు పోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక సమస్య పరిష్కారంపై పలుమార్లు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని, అయినప్పటికీ నెలలు కాదు సంవత్సరాలు గడుస్తున్న పరిష్కారం కాకపోవడంతో బల్దియా కార్యాలయం చుట్టూ తిరుగుతూ పదేపదే ఒకే సమస్య పై అనేకసార్లు ప్రజలు కమిషనర్ కు ఫిర్యాదు చేస్తున్నారు. గతంలో లాగా ప్రజావాణి సమస్యలపై కమిషనర్ ఎప్పటికప్పుడు అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించకపోవడం వల్ల సమస్యలు సమస్యలుగానే పేరుకు పోతున్నాయి. అంతేకాకుండా ప్రజావాణికి కొంతమంది అధికారుల డుమ్మా కొడుతుండడం ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై కమిషనర్ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న క్రమంలో ఆయా విభాగాల అధికా రులు లేకపోవడంతో ఫిర్యాదు దారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అధికారుల డుమ్మాలు, వాయిదాలలో ఉన్న ప్రజావాణి సమస్యలపై కమిషనర్ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజావాణి సమస్యలు చర్చనీయాంశంగా మారాయి.

# రజతోత్సవం కాదు.. రైతు విధ్వంసం

**సభ పేరుతో రైతుల భూములపై విధ్వంసం సృష్టించిన బీఆర్ఎస్**

**కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు సాదు నాగరాజు**



**శాయంపేట, మహా :** బీఆర్ఎస్ పార్టీ ఆదివారం నిర్వహించిన సభ రజతోత్సవం కాదని రైతు విధ్వంసమని, సభ పేరుతో రైతుల భూములపై గులాబీ పింకీలు విధ్వంసం సృష్టించారని శాయంపేట మండల కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు సాదు నాగరాజు అన్నారు.మంగళ వారం మండల కేంద్రంలో మహా పత్రిక ప్రతినిధి తో ఆయన మాట్లాడుతూ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభ కారణంగా వ్యవసాయానికి పనికి రాకుండా వ్యవసాయ భూములలో ఎర్రమన్నుతో సభా ప్రాంగణమంతా నింపడం,పొలానికిపొలానికి మధ్య గెట్లు ధ్వంసం చేయడం వలన రైతుల మధ్య గెట్ల పంచాయతీలు ఏర్పడే అవకాశం ఉందన్నారు.అదేవిధంగా పొలాలకు నీరందించే సాగునీటి కాలువలలో మన్ను మొరం, రాళ్లతో నింపి దారిని ఏర్పాటు చేయడం వలన జంతువులకు, రైతులకు నీళ్లు కరువు ఏర్పడుతుందన్నారు.ఎన్నో ఏళ్లుగా రైతులకు ఎండాకాలం, వర్షాకాలం నిలువ నీడనిచ్చిన చెట్లను కూల్చి పార్కింగ్ ఏర్పాటు చేసి రైతులకు నిలువ నీడ లేకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా నాయకులు, కార్యకర్తలు పొలాల్లో మందు సిట్టింగులు ఏర్పాటు చేసి బీర్లు, బ్రాండీ తాగి సీసాలను ఆ పొలాల్లోనే పగలగొట్టడం వలన పగిలిన మందు బాటిల్లతో రైతులకు ప్రమాదం వాటిల్లుతుందని అన్నారు. రజతోత్సవం సభ పేరుతో మొత్తం అడవిని నరకడంతో పాములు,తేళ్లు పక్కన ఉన్న గ్రామాల్లోకి వెళ్లడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారనీ,రాత్రిపూట గ్రామాల్లోకి వచ్చిన నెమళ్ల అరుపులతో ప్రజలకు నిద్ర కరువవుతుందన్నారు.డోజర్ లతో, రోడ్డు రోలర్లతో పొలాలను చదును చేయడం మూలంగా కరెంటు స్తంభాలు దెబ్బతిన్నాయని,బోర్లు, కరెంట్ వైర్లు మట్టి దిబ్బలుగా పొలాల్లో కలిశాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# లాండ సాంగ్వి వాగులో పూడిక తీత

**తిరిగి జలకళను సంతరించుకున్న వాగు**

**కంది శ్రీనివాస రెడ్డి తో పాటు అధికారులకు కాంగ్రెస్ శ్రేణుల కృతజ్ఞతలు**



**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ పట్టణానికి తాగునీరు అందించే లాండ సాంగ్వి వాగులో పూడిక తీసి నీటి లభ్యత పెరిగేలా చేసారు. దీంతో పూర్తిగా ఎండిపోయిన వాగులో మళ్లీ జలకళ సంతరించుకుని నీటి ఎద్దడి తీరనుంది. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల వాగు ఎండిపోయిన సందర్భంలో వాగును సందర్శించి భూగర్భ నీటి మట్టం లోతు పెంచి ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను ఆయన లేఖ ద్వారా కోరడంతో అధికారులు పూడిక తీత పనులు చేపట్టినట్టు తెలిపారు. పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి తీరేలా చేసిన కంది శ్రీనివాస రెడ్డికి వెంటనే స్పందించి నిధులు విడుదల చేసిన జిల్లా కలెక్టర్ కు మున్సిపల్ కమీషనర్ సిబ్బందికి పట్టణ ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు ధన్యవాదాలు తెలిపారు.

# మిస్సయిన యువకుని మృతదేహం లభ్యం



**వెంకటాపురం మహా:** ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండల కేంద్రం జక్కుల వారి వీధికి చెందిన వాసం రవి కిరణ్ ఈనెల 24వ తేదీన తప్పిపోగా మంగళవారం మృతదేహం లభ్యమయింది. మిషన్ భగీరథలో తాత్కాలిక పంప్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న వాసం రవి కిరణ్ తప్పిపోయిన ఆరు రోజుల తర్వాత మంగళవారం వెంకటాపురం నుండి రాచపల్లి, మల్లాపురం వెళ్లే రహదారి ప్రక్కన విగత జీవిగా పడి ఉన్నాడు. మృతదేహం బాగా దెబ్బతిన్నట్లు సమాచారం. పోలీసుల సమాచారం ప్రకారం ఈనెల 24వ తేదీన మిషన్ భగీరథ నీరు వదలడానికి మోటార్ సైకిల్ తీసుకొని వెళ్లిన అతను తిరిగి రాలేదని అతని తల్లి వాసం సాలమ్మ అన్నిచోట్ల వెతికినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఆమె 25 తేదీన పోలీస్ స్టేషన్కు వచ్చి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని. వడదెబ్బకు గురై అస్వస్థత కలిగి వి.ఆర్.కె పురం గ్రామ శివారులోని పాలెం ప్రాజెక్టు కాలువ సమీపంలో పడిపోగా, అది నిర్మానుష్య ప్రదేశమై ఎవరూ చూడకపోవడంతో మృతుడు చనిపోయినట్లుగా తెలుస్తుంది. అతని మృతదేహాన్ని మృతుని తల్లి వాసం సాలమ్మ గుర్తించగా ఆమె ఇచ్చిన వాంగ్మూలం మేరకు దర్యాప్తు కొనసాగుతున్నదనీ ఎస్సై తిరుపతి రావు మీడియాకు తెలిపారు.

# ఉదారతను చాటుకున్న మంత్రి పొంగులేటి

**బాలిక చదువుకు ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి**



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్ లో భూభారతి చట్టం2025 అవగాహన సదస్సులో పాల్గొనడానికి వేదిక వద్దకు చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అక్కడే ఒక వృద్ధురాలు కాగితం చేతిలో పట్టుకొని దీన స్థితి లో ఏదో అవసరం కోసం వేచి చూస్తున్నట్లుగా ఉండడాన్ని గమనించిన మంత్రి స్వయంగా వేదిక పై నుండి నిలబడి ఆ వృద్ధురాలిని వేదిక మీదకు ఆప్యాయం గా పిలిచి ఇక్కడికి ఎందుకు వచ్చావు అమ్మా.. అని సమస్యను గురించి ఆరా తీయగా.. ఆ వృద్ధురాలు బదులిస్తూ తన పేరు వేల్పుల ఊర్మిళ అని 41 వ డివిజన్ శంభునిపేటలో తన నివాసమని, తన మనవరాలు వేల్పుల లిటి ఇటీవల 4 వ తరగతి పూర్తి చేసుకుని సెయింట్ గాబ్రియల్ పాఠశాలలో 5 వ తరగతి లో ప్రవేశానికి పరీక్ష రాసి సీటు సాధించడం జరిగిందని, కానీ లిటి తల్లిదండ్రులు మనస్పర్థల వల్ల వేరు గా ఉంటున్నారనీ, తన మనవరాలికి సీటు దక్కినప్పటికిని చదివించే స్తోమత తనకు లేదని మంత్రి వద్ద వాపోగా, వెంటనే స్పందించిన మంత్రి చదువు కోవడానికి అయ్యే వ్యయాన్ని భరిస్తానని ప్రకటించి మంత్రి చూపిన ప్రోత్సాహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ముస్లింల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం వక్ఫ్ పై సవరణలు చేపట్టింది

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర**



**కరీంనగర్, మహా:** వక్ఫ్ నిబంధనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడానికి, పేద మధ్య తరగతి ముస్లింల ప్రయోజనాలు, సంక్షేమం అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం వక్ఫ్ (సవరణ) చట్టం చేపట్టిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు, వక్ఫ్ బోర్డు సవరణ కమిటీ తిమ్మాపూర్ మండల ప్రోగ్రాం కన్వీనర్ బూట్ల శ్రీనివాస్ అధ్యక్షతన వక్ఫ్ చట్ట సవరణ 2025 జన జాగరణ అభియాన్ మండల కార్యశాల ప్రోగ్రాం సోమవారం రోజున కొత్త పల్లి లోని సాయిరాం ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి ఆయన మాట్లాడుతూ వక్ఫ్ అనేది ఇస్లామిక్ చట్ట ప్రకారం ఇవ్వబడిన తిరిగి ఇవ్వలేని దాతృత్వ నిధి అన్నారు. భారతదేశంలో 1996 నుండి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. 2018 కేంద్రీయ వక్ఫ్ పరిషత్ నివేదిక ప్రకారం భారత్లో 10 లక్షల కోట్లకు పైగా అంచనా విలువ కలిగిన ఎనిమిది లక్షల ఎకరాలకు పైగా వక్ఫ్ కు ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అయితే వక్ఫ్ యొక్క పాలన వ్యవస్థ బలహీనంగా ఉండి , బోర్డులో ఎవరు ఎవరికి జవాబు దారి గా ఉండడం లేదని , ఆ కారణం చేతనే మోడీ ప్రభుత్వం వక్ఫ్ వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి వీలుగా వక్ఫ్( సవరణ) చట్టం2025ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రధానంగా వక్ఫ్ పెద్ద మొత్తంలో ఆస్తులు కలిగి ఉన్న ముస్లిం సమాజ ప్రయోజనాలు ,సంక్షేమం అభివృద్ధి కోసం వక్ఫ్ పనిచేసిన దాఖలాలు ఏమీ లేవని, ముస్లిం సమాజాన్ని దోచుకుందని ఆరోపించారు. ముస్లిం ప్రజా సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన వక్ఫ్ భారత్లో అన్నింటికన్నా పెద్ద స్కామ్ గా తయారైందన్నారు. లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉన్న వక్ఫ్ ముస్లిం సమాజ సంక్షేమ, అభివృద్ధి కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ఈరోజుకి 31 శాతం ముస్లింలు దారిద్యరేఖకు దిగువనే జీవితాలను గడుపుతున్నారని , వారికి చేయూతనివ్వాలనే ఆలోచన వక్ఫ్ ఏనాడూ చేయలేదన్నారు. ప్రధానంగా వక్ఫ్ భూములలో షాపింగ్ మాల్స్, హోటల్లు, వ్యాపార భవనాలు విలసిల్లుతున్నాయి కానీ పేద ముస్లింలకి ఇప్పటికీ ఏ విధమైన ప్రయోజనం చేకూరలేదన్నారు. 80 శాతం వక్ఫ్ భూములు అవినీతి, అక్రమ కబ్జాలకు గురయ్యాని పేర్కొన్నారు. ముస్లిం వర్గాల సేవ కోసం ఉద్దేశించిన వక్ఫ్ భూమి కొంతమంది వ్యక్తులకు రియల్ ఎస్టేట్ వ్యాపార సామ్రాజ్యంగా మారిందన్నారు.2018 లో కేంద్ర వక్ఫ్ పరిషత్ వెలువరించిన నివేదికలో వక్ఫ్ బోర్డులో ఏలాంటి పారదర్శకత లేదని, అవినీతి పతాకాస్థాయిలో ఉందని పేర్కొన్న విషయాన్ని ఆయనఈ సందర్భంగా గుర్తు చేశారు.

# నూతన ఎన్.సి.సి కల్నల్ ను సన్మానించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్ మహా:** విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని దేశాన్ని రక్షించడానికై అన్ని వేళలల్లో అందుబాటులో ఉండాలని తద్వారా సమాజంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హై స్కూల్ కు విచ్చేసినటువంటి నూతన కల్నల్ అధికారి ఎ.కె.జయంతను.. ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి పూల బొకే అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యన్.సి.సి విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా.. సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలిపారు.. యన్.సి.సి వారి విధివిధానాలు ప్రశంసనీయమైనవని.. పౌరులకు రక్షణ కవచంలాంటివని వారు అభివర్ణించారు. నూతనంగా నియమితులైన కల్నల్ అధికారి ఎ.కె. జయంత కు శుభాకాంక్షలు తెలియజేసారు.. వారి ఆధ్వర్యంలో నిర్వహించబడే వివిధ కార్యక్రమాలకు చేయూతనిస్తామని.. విద్యార్థులను కూడా అధిక సంఖ్యలో ప్రోత్సహించి కార్యక్రమాలను విజయవంతం చేస్తామని చెప్పారు. జయంత మాట్లాడుతూ అల్ఫోర్స్ పాఠశాలలో యన్.సి.సికి సంబంధించిన ప్రణాళికలను విద్యార్థులకు పలు నైతిక విలువలతో పాటు దేశ రక్షణకు సంబంధించిన విషయాలు పాఠశాల అధినేత నరేందర్ రెడ్డి సారథ్యంలో విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణను ఇవ్వడం జరుగుతున్నదని. సమాజ అభివృద్ధికి తోడ్పడుతాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, యన్.సి.సి. అధికారులు పాల్గొన్నారు.

# భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో రైతులకు మేలు

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి.. భూమి రైతు జీవితానికి ఆధారం.. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భూభారతి చట్టం 2025 ద్వారా రైతు సమస్యల పరిష్కారం లభిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్, తలకొండపల్లి మండలాలలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం2025 పై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కల్వకుర్తి నియోజకవర్గం శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. భూమి అనేది ఒక రైతు జీవితానికి చాలా పెద్ద ఆధారమని, ముఖ్యంగా భూభారతి చట్టంలో అప్పిలు వ్యవస్థ చాలా కీలకమైనదని అన్నారు. రైతుకు అన్యాయం జరిగితే అప్పీల్ చేసుకోవడం ద్వారా న్యాయాన్ని పొందవచ్చని, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, సి సి ఎల్ ఎ స్థాయిలలో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాలలో చాలా వరకు భూమి హద్దుల గొడవలు ఉంటాయని, కానీ భూభారతిలో రీ సర్వే, కొనుగోలు, పాలు పంపకాలు, దాన దస్తావేజులు, విరాసత్ పట్టా మార్పిడికి తప్పనిసరిగా కమతం జతపరచడం వల్ల భవిష్యత్తులో భూ గొడవలు ఉండవని తెలిపారు. భూభారతి చట్టంలో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ ఉందని, గతంలో గ్రామాలలో గ్రామ పరిపాలన, విఆర్ఓ/వి.ఆర్.ఏ వ్యవస్థ ఉండేవని, వాటిని తొలగించడం ద్వారా గ్రామాలలో సమస్యలపై సమాచారం లేదని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన వారిని గ్రామ పాలన అధికారి, మండల సర్వేయర్లను నియమించడం జరుగుతుందని, విరాసత్ మార్పిడికి వారసులకు అందరికీ నోటీసులు జారీ చేసే ప్రక్రియ ఈ నూతన చట్టంలో ఉందని, గతంలో ధరణి చట్టంలో ఈ అవకాశం లేదని తెలిపారు.



# భద్రత కోసం రూ.70 కోట్లు!

## సుందర్ పిచాయ్ జీతం ఎంతంటే?

ప్రపంచంలోని దిగ్గజ కంపెనీల సీఈఓల గురించి తెలుసుకునే చాలామంది.. మొదట సెర్చ్ చేసే విషయం జీతమే. ఎందుకంటే వారి వేతనాలు కోట్ల రూపాయల్లో ఉంటాయి. ఇప్పుడు తాజాగా 2024లో సుందర్ పిచాయ్ జీతానికి సంబంధించిన విషయాలు వెల్లడయ్యాయి. దీని గురించి మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. ఆల్ఫాబెట్ 2025 ప్రాక్సీ స్టేట్‌మెంట్ ప్రకారం, సుందర్ పిచాయ్ వేతనం 2024లో 10.73 మిలియన్ డాలర్లు (రూ. 91.4 కోట్లు). ఇందులో ఎక్కువ భాగం స్టాక్ అవార్డ్స్, ఇతర పరిహారాల రూపంలో అందింది. కాగా ఈయన బేసిక్ శాలరీ 2 మిలియన్ డాలర్లు (రూ. 17.04 కోట్లు). సాధారణ ఉద్యోగి జీతంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. 2023లో పిచాయ్ వేతనం 8.8 మిలియన్ డాలర్లు మాత్రమే. జీతం విషయం పక్కన పెడితే.. సుందర్ పిచాయ్ భద్రత కోసం ఆల్ఫాబెట్ కంపెనీ ఏకంగా 8.27 మిలియన్ డాలర్లను (రూ. 70.45 కోట్లు) ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అంతకు ముందు ఏడాది సంస్థ భద్రత కోసం చేసిన ఖర్చు 6.78 మిలియన్ డాలర్లు. అంటే సెక్యూరిటీ కోసం.. కంపెనీ అంతకు ముందు సంవత్సరం కంటే 22 శాతం ఎక్కువ ఖర్చు చేసింది. కంపెనీ అందించే భద్రతా ప్యాకేజీలో.. ఇంటి నిఘా, ప్రయాణ రక్షణ, వ్యక్తిగత డ్రైవర్లు వంటివన్నీ ఉంటాయి. అయితే దీనిని సంస్థ సుందర్ పిచాయ్ వ్యక్తిగత ప్రయోజనంగా కాకుండా.. ఉద్యోగ భద్రతలో భాగంగానే భావిస్తుంది. నిజానికి, సీఈఓ సుందర్ పిచాయ్ జీతం సగటు ఉద్యోగి జీతం కంటే దాదాపు 32 రెట్లు ఎక్కువ.

# 18 ఏళ్లలో 33 లక్షల మంది కొన్న కారు

# దీని గురించి తెలుసా?



2007లో ఇండియన్ మార్కెట్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి 'హ్యుందాయ్ ఐ10' ఏకంగా 33 లక్షల యూనిట్ల అమ్మకాలను అధిగమించింది. ఒక్క భారతదేశంలోనే ఈ కారును 20 లక్షల కంటే ఎక్కువ మంది కొనుగోలు చేశారు. కాగా కంపెనీ 140 కంటే ఎక్కువ దేశాలలో మరో 13 లక్షల యూనిట్లను ఎగుమతి చేసినట్లు తెలుస్తోంది. హ్యుందాయ్ కంపెనీకి చెందిన ఐ10ను ఎక్కువగా దక్షిణాఫ్రికా, మెక్సికో, చిలీ, పెరూ దేశాలకు ఎగుమతి చేశారు. 2007లో మొదటి సారి ఇండియన్ మార్కెట్లో అడుగుపెట్టిన ఈ కారు.. ఆ తరువాత అనేక అప్డేట్స్ పొందుతూ.. ఐ10, గ్రాండ్ ఐ10, గ్రాండ్ ఐ10 నియోస్ అనే మూడు వేరియంట్లలో.. 1.2 లీటర్ పెట్రోల్ మాన్యువల్, 1.2 లీటర్ పెట్రోల్ ఆటోమాటిక్, CNGతో 1.2 లీటర్ పెట్రోల్ అనే మూడు ఇంజిన్ ఆప్షన్లలో అందుబాటులోకి వచ్చింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ప్రతి ఏటా సగటున లక్ష యూనిట్ల కంటే ఎక్కువ ఐ10 కార్లను విక్రయించింది. ఇది మంచి డిజైన్, డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్, కీలెస్ ఎంట్రీ వంటి అనేక కొత్త ఫీచర్స్ పొందింది. గ్రాండ్ i10 నియోస్ ధర రూ. 5.92 లక్షల నుంచి రూ. 8.56 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంటుంది. ఇది ఎరా, మాగ్నా, కార్పొరేట్, స్పోర్ట్జ్, ఆస్టా అనే ఐదు వేరియంట్లలో లభిస్తోంది.

# తయారీని బలోపేతం చేసేందుకు కమిటీ

## నీతి ఆయోగ్ సీఈవో

**న్యూఢిల్లీ:** ప్రతిపాదిత జాతీయ తయారీ కార్యక్రమం రూపురేఖలను ఖరారు చేయడానికి వీలుగా ప్రభుత్వం ఓ అంతర్ మంత్రిత్వ కమిటీని నియమించింది. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం చైర్మన్‌గా ఏర్పాటైన ఈ కమిటీ భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు నిర్వహించనున్నట్టు ఓ అధికారి తెలిపారు. భారత్‌లో తయారీని మరింత ప్రోత్సహించేందుకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం లోగడే ప్రకటించడం గమనార్హం. దీన్ని ఇప్పుడు ఆచరణలోకి తీసుకొచ్చింది. వ్యాపార నిర్వహణ వ్యయాలు తగ్గించడం, భవిష్యత్‌కు అనుగుణమైన ఉద్యోగులను సిద్ధం చేయడం, ఎంఎస్ఎంఈని బలోపేతం చేయడం,



టెక్నాలజీ లభ్యత, నాణ్యమైన ఉత్పత్తులు.. అనే ఐదు అంశాలపై ఈ కమిటీని కీలక సిఫారసులు చేయనుంది.

# ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం

## మరో 195 మంది ట్రైనీలు..




2025లోనూ లేఆఫ్స్ పర్వం కొనసాగుతూనే ఉంది. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ వరుస తొలగింపులు చేపడుతూనే ఉంది. తాజాగా మరో 195 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ ఏడాదిలోనే ట్రైనీలను తొలగించడం వరుసగా నాలుగోసారి కావడం గమనార్హం. ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా 195 మందిని తొలగించినట్లు తెలుస్తోంది. వీరందరికీ కంపెనీ ఈ మెయిల్స్ ద్వారా సమాచారం అందించినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 2025 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు సంస్థ సుమారు 800 మంది ట్రైనీలను తొలగించింది. భారతదేశంలో రెండవ అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఏప్రిల్ 18న దాదాపు 240 మందిని తొలగించగా, అంతకు ముందు ఫిబ్రవరిలో 300 మందికి పైగా ట్రైనీలను, మార్చిలో 30 నుంచి 35 మందిని తొలగించింది. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్‌గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్‌ను కూడా సంస్థ అందిస్తోంది. ఇన్ఫోసిస్ కంపెనీ తొలంగించిన ట్రైనీలందరినీ.. 2022లో నియమించుకుంది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం మిశ్రమంగా ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సరికి స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 28.11 పాయింట్లు లేదా 0.035 శాతం లాభంతో.. 80,246.48 వద్ద, నిఫ్టీ 7.45 పాయింట్లు లేదా 0.031 శాతం లాభంతో 24,335.95 వద్ద నిలిచాయి. టాప్ గెయినర్స్ జాబితాలో మాలు పేపర్ మిల్స్, పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్, డేటా ప్యాటర్న్స్ (ఇండియా), గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ & ఇంజనీర్స్, టీబీఓ టెక్ వంటి కంపెనీలు చేరగా.. మ్యాక్స్ ఇండియా లిమిటెడ్, గ్లోబల్ వెక్ట్రా హెలికార్ప్, మనక్సియా, శివ మిల్స్ లిమిటెడ్, లక్ష్మి ఫైనాన్స్ అండ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.





# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL




# ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడీకి చెక్..

## చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

**ఢిల్లీ :** ప్రైవేట్ స్కూళ్లల్లో అడ్డగోలు ఫీజుల దందాపై చరిత్రలో తొలిసారి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఢిల్లీ స్కూళ్లలో ఫీజులు ఎంత మేరకు ఉండాలనే అంశంపై ప్రభుత్వం విధివిధానాల్ని ఖరారు చేసింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోనుంది. ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు 2025పై ఢిల్లీ కేబినెట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో పలు స్కూల్స్ ఏకపక్షంగా ఫీజుల పెంచుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఢిల్లీ కేబినెట్ మంగళవారం పాఠశాల ఫీజులను నియంత్రించడానికి చట్టాన్ని ఆమోదించింది. అనంతరం ఢిల్లీ సీఎం రేఖా గుప్తా మీడియాతో మాట్లాడారు. నా ఆనందానికి అవధుల్లేవు. ఢిల్లీ ప్రభుత్వం ధైర్యమైన నిర్ణయం నిర్ణయం తీసుకుంది. పలు స్కూల్స్ ఏకపక్షంగా ఫీజుల పెంచుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఢిల్లీ కేబినెట్ మంగళవారం పాఠశాల ఫీజులను నియంత్రించడానికి ఒక చట్టాన్ని ఆమోదించింది. ఢిల్లీ ప్రభుత్వం చారిత్రాత్మక,సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు 2025 ముసాయిదా బిల్లును ఈరోజు కేబినెట్ ఆమోదించిందని మీకు చెప్పడానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను'అని



అన్నారు. ఢిల్లీలోని 1,677 పాఠశాలలు ఎయిడెడ్, నాన్‌ఎయిడెడ్ లేదా ప్రైవేట్ అయినా, ఫీజులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకం, విధానాన్ని నిర్ణయిస్తారు. చరిత్రలో మొదటిసారిగా, అటువంటి బిల్లును ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. విద్యా మంత్రి ఆశిష్ సూద్ మాట్లాడుతూ, కొత్త నిబంధనలను అమలు చేయడానికి మూడు కమిటీలను ఏర్పాటు చేస్తామని, పాఠశాల మౌలిక సదుపాయాల ఆధారంగా మూడు సంవత్సరాల పాటు ఫీజులను ప్యానెల్లు నిర్ణయిస్తాయని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా నిర్ణయం తీసుకునే ప్రక్రియలో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల ప్రారంభంలో ఢిల్లీలోని పలు స్కూళ్లు ఏకపక్షంగా ఫీజులు వసూలు చేస్తున్నాయంటూ తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులతో పలు పాఠశాలలకు ఢిల్లీ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. తన ప్రభుత్వం పారదర్శకత, పిల్లల విద్యా హక్కు రక్షణకు కట్టుబడి ఉందని ఆ సమయంలో సీఎం రేఖా గుప్తా స్పష్టం చేశారు.




# కెనడాలో భారతీయ విద్యార్థిని అదృశ్యం విషాదాంతం

**ఒట్టావా:** కెనడాలో భారతీయ విద్యార్థిని వంశిక సైనీ మిస్సింగ్ కేసు విషాదాంతంగా ముగిసింది. స్థానికంగా ఓ బీచ్‌లో ఆమె శవమై కనిపించింది. ఆమె మృతదేహాన్ని రికవరీ చేసుకున్న స్థానిక పోలీసులు.. మృతికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ఈ విషయాన్ని కెనడాలోని భారత హైకమిషన్ ధ్రువీకరిస్తూ.. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. వివరాల్లోకి వెళ్తే.. పంజాబ్ ఆప్ నేత దేవిందర్ సింగ్ కుమార్తె వంశిక. ఆమె రెండున్నరేళ్ల కిందట డిప్లొమా కోర్సు కోసం కెనడా వెళ్లింది. ఏప్రిల్ 25వ తేదీన అద్దె ఇంటిని వెతికేందుకు బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. ఆమె నుంచి రెండు రోజులు ఫోన్ కాల్ లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె స్నేహితులకు కాల్ చేశారు. వాళ్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 28వ తేదీన ఆమె మృతదేహం ఒట్టావా బీచ్ వద్ద లభ్యమైంది. ఆమె మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తరలించే అంశంతో పాటు ఈ కేసులో స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. ఇదిలా ఉంటే.. ఇటీవల కెనడాలో భారతీయ విద్యార్థుల మరణాలు పెరిగిపోయాయి. తాజాగా.. గ్యాంగ్ వార్‌లో భాగంగా జరిగిన కాల్పుల్లో.. బస్టాప్‌లో వేచి చూస్తున్న 21 ఏళ్ల భారతీయ విద్యార్థిని హర్ సిమ్రత్ రంధావా బుల్లెట్ తగిలి అనూహ్యంగా చనిపోయింది. కొన్నాళ్ల కిందట.. రాక్‌లాండ్ ప్రాంతంలో ఓ భారతీయుడు కత్తి పోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# భారత్‌తో యుద్ధ భయం

## పాక్ సైన్యంలో భారీ రాజీనామాలు




**ఇస్లామాబాద్:** కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం నెలకొంది. భారత్ ఎప్పుడు, ఎలా దాడి చేస్తుందోనన్న భయంతో పాకిస్తాన్ వణికిపోతోంది. తమపై భారత్ వైమానిక దాడులకు దిగొచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో భారత వైమానిక దాడులను పసిగట్టడానికి సియాల్‌కోట్ ప్రాంతానికి పాక్ సైన్యం తన రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నట్లు సమాచారం. అలాగే, అత్యవసరంగా తమ దేశ గగనతలాన్ని సైతం మూసివేసింది.ఇదిలా ఉండగా.. పహల్గాం దాడి తర్వాత భారత్ తీసుకుంటున్న చర్యలు, హెచ్చరికల కారణంగా పాకిస్తాన్‌కు టెన్షన్ మొదలైంది. ఈ క్రమంలో పాక్ ఆర్మీ కూడా భయాందోళనకు గురైనట్టు తెలుస్తోంది. ఈ ఉగ్రదాడి తర్వాత.. కేవలం రెండు రోజుల వ్యవధిలో పాకిస్తాన్ ఆర్మీలో 4500 మంది సైనికులు, 250 మంది అధికారులు తమ పదవులను విడిచిపెట్టి వెళ్లిపోయినట్టు 'ది డేలీ గార్డియన్' ఓ కథనంలో వెల్లడించింది. ఈ మేరకు పాక్ 11వ దళ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఉమర్ బుఖారీ లేఖను బయటపెట్టింది.

కథనం ప్రకారం.. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు బుఖారీ ఒక లేఖ రాశారు. ఈ లేఖలో తమ దేశ సైనికుల ఆత్మస్థైర్యం వేగంగా క్షీణిస్తోందని హెచ్చరించారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే.. ఒకవేళ భారత్‌తో యుద్ధం చేయాల్సి వస్తే.. పాకిస్తాన్ సైన్యం అసమర్థమైన ప్రతిఘటనను ప్రదర్శించవచ్చు. కొంతమంది సైనికులు ఇప్పటికే క్రియాశీల విధులను విడిచిపెట్టినప్పటికీ, మరికొందరు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇది పాకిస్తాన్ సైనిక ర్యాంకుల్లో తీవ్ర సంక్షోభాన్ని సూచిస్తోంది. ఈ పరిణామం తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు.. సామూహిక రాజీనామాలపై పాకిస్తాన్ సీనియర్ అధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం.

ఇదిలా ఉండగా.. పహల్గాం దాడి తర్వాత బలమైన భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంటుందనే భయమే రాజీనామాలకు ముఖ్య కారణంగా తెలుస్తోంది. భారత్ ఎప్పుడైనా దాడి చేయవచ్చనే భయంతో సైనికులు కుటుంబ సభ్యులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు సైనికులు రాజీనామాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

## మునీర్ ఎక్కడ?

**మరోవైపు.. సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న వేళ సైన్యాధిపతి జనరల్ సయీద్ అసిమ్ మునీర్ కనిపించడం లేదన్న వార్తలు పాకిస్తాన్‌లో కలకలం రేపుతున్నాయి. కుటుంబంతో పాటుగా ఆయన దేశం వీడి పారిపోయారని స్థానిక మీడియాలో ఆదివారం వార్తలొచ్చాయి. 'తొలుత కుటుంబాన్ని విదేశాలకు తరలించారు. తర్వాత తానూ పాక్ వీడారు' అన్నది వాటి సారాంశం. కొద్ది రోజులుగా, ఆ మాటకొస్తే పహల్గాం దాడి జరిగినప్పటి నుంచీ మునీర్ బయట ఎక్కడా కన్పించడం లేదని ఆ కథనాలు చెబుతున్నాయి. దాడిపై ఆగ్రహంతో రగిలిపోతున్న భారత్ తీవ్రస్థాయిలో ప్రతీకార చర్యలకు దిగుతుందని పాక్ ఆందోళన చెందుతోంది. అందుకు తానే బాధ్యుడిని అవుతానని మునీర్ భయపడ్డారు. అందుకే దేశం నుంచి జారుకున్నట్టు కనిపిస్తోంది' అని కథనాలు పేర్కొంటున్నాయి**

# ట్రంప్ కోరుకునేది ఎన్నటికీ జరగదు

## విక్టరీ స్పీచ్‌లో మార్క్ కార్నీ

**టొరంటో:** కెనడాలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అధికార లిబరల్ పార్టీ విజయం దిశగా దూసుకెళ్తోంది. వరుసగా నాలుగోసారి అధికారం చేపట్టడం దాదాపు ఖాయం కావడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఈ క్రమంలో మార్క్ కార్నీ మద్ధతుదారుల్ని ఉద్దేశిస్తూ విజయ ప్రసంగం చేస్తూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ''కెనడా చరిత్రలో కీలకమైన క్షణం ఇది. అమెరికా తో మన పాత ఏకీకరణ సంబంధం ఇప్పుడు ముగిసింది. ఇకపై అమెరికాను స్థిరమైన మిత్రదేశంగా నమ్మలేం. అమెరికా చేసిన ద్రోహం నుండి మనం తేరుకుంటున్నాం. నెలల తరబడి నుంచి నేను ఈ విషయంలో హెచ్చరిస్తూ వస్తున్నా. అమెరికా మన భూమిని, మన వనరులను, మన నీటిని, మన దేశాన్ని కోరుకుంటోంది. మనల్ని విచ్ఛిన్నం చేసి తద్వారా కెనడాను సొంతం చేసుకోవాలని ట్రంప్ ప్రయత్నించారు. కానీ, అది ఎప్పటికీ జరగదు'' అని కార్నీ అన్నారు. అమెరికాతో సుంకాల యుద్ధం, కెనడా యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపుల వేళ ఈ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కెనడా పార్లమెంట్‌లో 343 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ




ఏర్పాటునకు 172 మెజారిటీ అవసరం. ఇప్పటికే కన్జర్వేటివ్ పార్టీ నేత పియరీ పొయిలివ్రా ఓటమిని అంగీకరించారు. అయితే లిబరల్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోయినప్పటికీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీంతో మిత్రపక్షాలతో కలిసి మార్క్ కార్నీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.



# జీవితమంతా వాళ్లకు సారీ చెబుతూనే ఉంటా: శ్రుతి హాసన్

కమల్ హాసన్ కూతురిగా శ్రుతి హాసన్ అందరికీ తెలుసు. కెరీర్ ప్రారంభంలో ఐరన్ లెగ్ అనే ముద్ర వేసుకున్న ఈమె.. క్రమంగా సినిమాలతో హిట్ కొడుతూ సక్సెస్ ఫుల్ అనిపించుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తన కెరీర్, లవ్ బ్రేకప్స్ గురించి మాట్లాడింది. 'నాకు ఎంతో ఇష్టమైన వాళ్లని కొన్నిసార్లు బాధపెట్టాను. అనుకోకుండా అది జరిగినప్పటికీ.. అలా చేసి ఉండకూడదని ఇప్పటికీ అనుకుంటూ ఉంటాను. జీవితమంతా వాళ్లకు సారీ చెబుతూనే ఉంటా. ప్రతి ఒక్కరి జీవితంలో బ్రేకప్ లవ్ స్టోరీ ఉంటుంది. మాజీ భాగస్వామి వల్ల ఎన్నో విషయాలు తెలుసుకుంటాం. నాకు అలాంటి బ్రేకప్ స్టోరీలు ఉన్నాయి' 'బ్రేకప్స్ గురించి నేను ఎక్కువ ఆలోచించను. నా లవ్ స్టోరీస్ గురించి చాలామంది ఏవేవో మాట్లాడుతుంటారు. ఇతడు ఎన్నో బాయ్ ఫ్రెండ్? అని అడుగుతూ ఉంటారు. వారి దృష్టిలో అది కేవలం నంబర్ మాత్రమే. నా వరకు వస్తే నేను అన్నిసార్లు ప్రేమలో విఫలమవుతున్నానని అర్థం. ఇప్పటికీ నాకు సరైన ప్రేమ దొరకలేదు' అని శ్రుతి హాసన్ చెప్పుకొచ్చింది. 'కెరీర్ ప్రారంభంలో తెలుగులో నా రెండు సినిమాలు ఫెయిలయ్యాయి. నన్ను చాలా మాటలు అన్నారు. కానీ హీరో సిద్ధార్థ్ ని మాత్రం ఏం అనలేదు. నాకు గబ్బర్ సింగ్ మూవీతో సక్సెస్ వచ్చింది. ఎక్కువ సినిమాలు చేయట్లేదని చాలామంది అంటుంటారు. కానీ నా మనసుకు నచ్చిన మూవీస్ చేస్తున్నానని వాళ్లకు తెలీదు' అని శ్రుతి తనపై వచ్చిన విమర్శలకు సమాధానమిచ్చింది. మొన్నటివరకు శంతను హజారికా అనే ఆర్టిస్టుతో ప్రేమలో ఉన్న శ్రుతి హాసన్.. అంతకు ముందు ఓ విదేశీయుడితో చెట్టాపట్టాలేసుకుని కనిపించింది. కెరీర్ ప్రారంభంలో మాత్రం ఒక రిద్దరు హీరోలతో ఈమె రిలేషన్ షిప్ మెంటైన్ చేసినట్లు రూమర్స్ వచ్చాయి. ప్రస్తుతానికైతే ఈమె ఎవరితోనూ ప్రేమలో లేదు!

# బెల్లంకొండ హీరో దెయ్యం సినిమా.. గ్లింప్స్ రిలీజ్



తెలుగులో చాలామంది హీరోలు ఉన్నారు. వాళ్లలో ఒకడు బెల్లంకొండ శ్రీనివాస్. పదేళ్లకు పైనే ఇండస్ట్రీలో ఉన్నాడు కానీ చెప్పకోదగ్గ సినిమాలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. చివరగా 2023లో ఛత్రపతి చిత్రాని హిందీలో రీమేక్ చేసి ఘోరంగా ఫెయిలయ్యాడు. దీంతో చాలా గ్యాప్ తీసుకుని ఒకేసారి నాలుగు సినిమాల్ని రెడీ చేస్తున్నాడు. అందులో 'భైరవం' త్వరలో రిలీజ్ అవుతుంది. ఇప్పుడు 'కిష్కిందపురి' అని మరో మూవీ ప్రకటించాడు. తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు. పాడుబడ్డ పెద్ద భవంతి, అందులో హీరో అండ్ గ్యాంగ్ వెళ్తారు. తర్వాత ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనే అంశాలతో ఈ 'కిష్కిందపురి' తీసినట్లు అనిపిస్తుంది. గతంలో బెల్లంకొండ హీరోతో 'రాక్షసుడు' సినిమాలో నటించిన అనుపమ.. ఇందులో హీరోయిన్. తొలిసారి హారర్ జానర్ సినిమాతో బెల్లంకొండ శ్రీనివాస్ రాబోతున్నాడు. ఈ వర్షా కాలంలోనే మూవీ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. కౌశిక్ పెగళ్లపాటి దర్శకుడు. మరి ఈసారైనా బెల్లంకొండ హిట్ కొడతాడా? ఈ గ్లింప్స్ చూస్తుంటే విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. చివర్లో హీరో... అహం మృత్యు అని చెప్పిన డైలాగ్, ఆ టైంలో కళ్లు దెయ్యం కళ్లలా ఉండటం చూస్తుంటే ఈసారి ప్రేక్షకుల్ని భయపెడతారనిపిస్తోంది. గతంలో అనుపమతో థ్రిల్లర్ మూవీ చేయగా.. ఇప్పుడు హారర్ చేశాడు శ్రీనివాస్.

# ఎల్లమ్మ దొరకట్లేదు.. ఇప్పుడెలా?





'బలగం' తర్వాత దర్శకుడు వేణు(venu yeldandi) చాలా గ్యాప్ తీసుకున్నాడు. తన రెండో సినిమా 'ఎల్లమ్మ' (Yellamma Movie) అని ప్రకటించి చాలా రోజులైంది కానీ, ఇంకా పట్టాలెక్కలేదు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో తొలుత నాని హీరోగా నటిస్తారనే ప్రచారం జరిగింది. నాని కూడా వేణుతో సినిమా చేస్తానని చెప్పారు. ఏం జరిగిందో తెలియదు కానీ నాని ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. చివరకు ఈ కథ అటు తిరిగి ఇటు తిరిగి నితిన్ (Nithiin) దగ్గర వెళ్లింది. కథ బాగా నచ్చడంతో నితిన్ ఈ చిత్రాన్ని వెంటనే ఓకే చేశాడు. డేట్స్ కూడా అరేంజ్ చేసుకున్నాడు. నిర్మాత దిల్ రాజు కూడా సినిమా షూటింగ్ స్టార్స్ చేసేందుకు రెడీగా ఉన్నాడు. కానీ ఈ సినిమాకు కీలకమైన హీరోయిన్ మాత్రం దొరకడం లేదట. 'ఎల్లమ్మ' కోసం అటు దిల్ రాజు, నితిన్.. ఇటు వేణు తెగ వెతుకుతున్నారట. బలగం మాదిరే ఈ కథ కూడా రూరల్ నేపథ్యంలోనే సాగుతుదంట. దర్శకుడు వేణు చాలా పకడ్బంధీగా ఈ సినిమా స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాడట. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకి చాలా ప్రాధాన్యత ఉంటుందట. కథ మొత్తం ఆమె చుట్టునే తిరుగుతుంది. అందుకే ఓ స్టార్ హీరోయిన్‌ని ఆ పాత్రకు తీసుకోవాలనుకున్నారట. తొలుత సాయి పల్లవి అయితే బాగుంటందని ఆమెను సంప్రదించారు. అయితే సాయి పల్లవి ఈ సినిమా చేయలేనని చెప్పేసిందట. దీంతో మరో స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ అయితే 'ఎల్లమ్మ'కు న్యాయం చేస్తుందని ఆమెను సంప్రదించారట. అయితే కథ, పాత్ర బాగా నచ్చినప్పటికీ.. డేట్స్ ఖాళీగా లేకపోవడం నో చెప్పేసిందట. శ్రీలీలను తీసుకుందామంటే.. అల్రెడీ నితిన్‌తో రెండు సినిమాలు చేసింది. అవి కూడా ఫ్లాప్ అవ్వడంతో దిల్ రాజు వెనకడుకు వేస్తున్నాడట. ఇక రష్మిక, సమంత లాంటి హీరోయిన్లు కూడా ఖాళీగా లేరు. నితిన్ ఎప్పుడైన తన సినిమాలకు ట్రెండింగ్ హీరోయిన్‌ని తీసుకుంటాడు. కానీ ఈ సారి మాత్రం అది వర్కౌట్ అయ్యేలా లేదు. స్టార్ హీరోహీరోయిన్లు అంతా బిజీగా ఉన్నారు. మరి 'ఎల్లమ్మ'గా ఎవరు ఎంట్రీ ఇస్తారో చూడాలి.

# 'బాహుబలి' టైంకి నాకు 27 ఏళ్లే.. కానీ అలా చూపించేసరికి



బాహుబలి 2 సినిమా చూశారా? అందులో కుంతల రాజ్యానికి అనుష్క అలియాస్ దేవసేన యువరాణిగా ఉంటుంది. ఆమెకు వదినగా చేసిన నటి కూడా మీకు గుర్తుండే ఉంటుంది. ఆమెనే ఆశ్రిత వేమగంటి. చూస్తే వయసు మళ్లినట్లు కనిపిస్తుంది కానీ ఈ మూవీ చేసేటప్పటికీ ఆమెకు 27 ఏళ్లే. స్వయానా ఆమెనే ఈ విషయాన్ని బయటపెట్టింది. ఇంతకీ ఏం చెప్పిందంటే?'బాహుబలి సినిమా చేసేటప్పటికి నా వయసు 27 ఏళ్లే. కానీ కాస్త పెద్దదానిలా చూపించారు. దీంతో ఇప్పటికీ ఎవరైనా నన్ను కలిస్తే మీరు బయట చాలా యంగ్ గా ఉన్నారని అంటుంటారు. అవును ఇదే నేను అని వాళ్లతో చెబుతుంటాను. చాలామంది నన్ను స్క్రీన్ పై చూసి నాది పెద్ద వయసు అనుకున్నారు. ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడేసుకుంటున్నారు' 'ఇలా కాస్త ప్లస్ సైజులో ఉండటం వల్ల నాకు నచ్చిన పాత్రలు దాదాపు నేను చేయలేను. ఎందుకంటే ప్లస్ సైజులో ఉంటే గౌరవప్రదమైన రోల్స్ కోసం మాత్రమే తీసుకుంటారు. సదరు దర్శకులకు నా నిజమైన వయసు గురించి చెప్తే.. పాత్రకు వయసు ఎక్కువున్నా సరే చాలా పవర్ ఫుల్ అదీ ఇదీ అని చెప్పి నన్ను కన్విన్స్ చేసేందుకు ప్రయత్నిస్తారు' అని ఆశ్రిత చెప్పుకొచ్చింది. స్వతహాగా క్లాసికల్ డ్యాన్సర్ అయిన ఈమె.. బాహుబలి 2 సినిమాతో నటిగా కెరీర్ ప్రారంభించింది. తర్వాత మహర్షి, MCA, క్రాక్, డియర్ కామ్రేడ్, యాత్ర, యానిమల్ తదితర చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర'లో కీలక పాత్ర చేస్తోంది.

# క్రీడా వార్తలు SPORTS NEWS



## కేకేఆర్ ఈజ్ బ్యాక్.. ఢిల్లీపై గ్రాండ్ విక్టరీ

ఐపీఎల్2025లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తిరిగి పుంజుకుంది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయం సాధించింది. 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 9 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేయగల్గింది. ఢిల్లీ బ్యాటర్లలో ఫాఫ్ డుప్లెసిస్(62) టాప్ స్కోరర్‌గా నిలవగా.. అక్షర్ పటేల్(43) ఫర్వాలేదన్పించాడు. వీరితో విప్రజ్ నిగమ్(19 బంతుల్లో 38) ఆఖరిలో మెరుపులు మెరిపించనప్పటికి జట్టును గెలిపించలేకపోయాడు. కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ మూడు వికెట్లు పడగొట్టగా.. వరుణ్ చక్రవర్తి రెండు, అనుకుల్ రాయ్,రస్సెల్, ఆరోరా తలా వికెట్ సాధించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లలో రఘువంశీ(44) టాప్ స్కోరర్‌గా నిలవగా.. రింకూ సింగ్(36), గుర్బాజ్(26), నరైన్(27), రహానే(26) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్,విప్రజ్ నిగమ్ తలా రెండు వికెట్లు సాధించారు. ఈ విజయంతో కేకేఆర్ తమ ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.

## వైభవ్ బేబీ బాయ్ కాదు.. బీభత్సానికి కేరాఫ్

పాలబుగ్గల పిల్లాడిని అనామకుడు అనుకుంటే హడలెత్తించాడు. పద్నాలుగేళ్ల వయసులోనే రికార్డు సెంచరీతో చరిత్ర పుటల్లో తన పేరు రాసుకున్నాడు. అతడే వైభవ్ సూర్యవంశీ (Vaibhav Suryavanshi). ఐపీఎల్ 18వ సీజన్‌లో 265.78 స్ట్రయిక్ రేటుతో శతకం బాది 'టాక్ ఆఫ్ ది వరల్డ్ అయ్యాడీ కుర్రాడు. తన పవర్ స్ట్రోక్‌తో విధ్వంసక శతకం బాదిన వైభవ్.. తాను 'బేబీ బాయ్ కాదని బీభత్సానికి కేరాఫ్' అని ప్రపంచానికి చాటాడు. జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై వైభవ్ ఊచకోత చూసినవాళ్లంతా ముక్తకంఠంతో ఇప్పుడిదే మాట అంటున్నారు. టీమిండియా దిగ్గజం రవిశాస్త్రి(Ravi Shastri) భవిష్యత్‌లో భారత జట్టుకు ఆడే క్రికెటర్లలో వైభవ్ కచ్చితంగా ఉంటాడని చెప్పేశాడు. ఇక ఎంఎస్ ధోనీ (MS Dhoni) అయితే... ఈ పిల్లాడు చాలా అనుభవజ్ఞుడిలా ఆడుతున్నాడు. అతడికి ఎంతో భవిష్యత్ ఉందని తమతో చెప్పాడని రాజస్థాన్ జట్టు మేనేజర్ రోమి భిందెర్ తెలిపాడు. మాజీ ఆటగాళ్లు అయితే.. 'మీరు 14 ఏళ్ల వయసులో ఏం చేసేవాళ్లు.. వైభవ్‌ను చూడండి అతడు రికార్డులు బద్దలు కొడుతున్నాడు' అని ఈ యువకెరటం ప్రతిభను ఆకాశానికెత్తేస్తున్నారు. ఓపెనర్‌గా ఈ బిహార్ కుర్రాడు రాణిస్తుండడంతో రాజస్థాన్‌కు కొత్త తలనొప్పి మొదలైంది. కెప్టెన్ సంజూను ఏ స్థానంలో ఆడించాలి? ఎవరిని బెంచ్‌పై కూర్చోబెట్టాలి అనేది? ద్రవిడ్ బృందానికి తోచడం లేదు.

## మౌనంగా ఉండొద్దు
### ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



పహల్గాంలోని బసరన్ లోయలో అమాయకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదుల కోసం భారత ఆర్మీ జల్లెడ పడుతోంది. ఆచూకీ చెబితే రూ.20 లక్షల రివార్డు అని ప్రకటించింది కూడా. నరమేధానికి పాల్పడిన ఆ టెర్రరిస్టులకు తగిన శిక్ష వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ సైతం అదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహకాళేశ్వరుడుని భజ్జీ దర్శించుకున్నాడు. దైవ దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రదాడిని ఖండించాడు. 'భూతల స్వర్గమైన జమ్మూ కశ్మీర్‌లో పర్యటిస్తున్న వాళ్లను ఉగ్రవాదులు కాల్చి చంపడం దురదృష్టకరం. 28 మందిని హతమార్చిన టెర్రరిస్టులు యావత్ దేశం ఒలిక్కిపడేలా చేశారు. ఈ దాడికి బదులు తీర్చుకునేలా మనం ఏదో ఒకటి చేయాలి. ఉగ్రవాదులు మనదేశంలోకి చొరబడి మనవాళ్లను చంపేస్తుంటే మౌనంగా ఉండొద్దు. ఆ ముష్కరులకు కఠిన శిక్ష పడేలా చూడాలి' అని భజ్జీ అన్నాడు. ఏప్రిల్ 22న మధ్యాహ్నం అడవి మార్గం గుండా బసరన్ లోయలో చొరబడిన ఉగ్రవాదులు దారుణానికి తెగబడిన విషయం తెలిసిందే. పిల్లలు, మహిళలను వదిలేసి పురుషులను లక్ష్యంగా చేసుకున్నారు. వాళ్లను 'ఐడీ కార్డులు చూపించండి.. మీ మతం ఏంటో చెప్పండి.. అల్లాహూ అక్బర్ అనండి'.. అని ఆదేశించి చివరకు హిందువులుగా గుర్తించిన 26 మందిని కాల్చి చంపారు. ఈ ఉగ్రదాడిని భజ్జీ సహా పలువురు మాజీ ఆటగాళ్లు ఖండించారు... భాదిత కుటుంబాలకు సంఘీభావం తెలియజేస్తూ భారత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, సిరాజ్, గిల్.. ఎక్స్‌లో పోస్టులు పెట్టారు.



## సూర్యవంశీకి భారీ నజరానా
### రూ.10 లక్షలు ప్రకటించిన బీహార్ సీఎం

**మహా:** రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయాడు. సోమవారం జైపూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 14 ఏళ్ల సూర్యవంశీ సంచలన ప్రదర్శన కనబరిచాడు. అద్భుత సెంచరీతో క్రికెట్ ప్రపంచాన్ని తన వైపు తిప్పుకున్నాడు. అత్యంత చిన్న వయస్సులో ఐపీఎల్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 38 బంతులు ఆడిన వైభవ్ సూర్యవంశీ ఏడు ఫోర్లు, పదకొండు సిక్సర్లతో 101 పరుగులు చేశాడు. బిహార్‌కు చెందిన సూర్యవంశీపై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో వైభవ్‌కు బిహార్ సీఎం నితీష్ కుమార్ రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. "ఐపీఎల్ చరిత్రలో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా (14 సంవత్సరాలు) నిలిచిన వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. సూర్యవంశీ తన అద్భుత టాలెంట్‌తో భారత క్రికెట్‌కు భవిష్యత్తు ఆశా కిరణంగా నిలిచాడు. అతడి అంకితభావాన్ని, పట్టుదలను చూసి మేము గర్విస్తున్నాము. నేను 2024లో సూర్యవంశీ, అతడి తండ్రిని కలిశాను. ఐపీఎల్‌లో అతడి అద్భుతమైన ప్రదర్శన తర్వాత, ఫోన్‌లో సూర్యవంశీతో మాట్లాడాను. వైభవ్ సూర్యవంశీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల నగదు బహుమతి అందజేయనున్నాము. వైభవ్ భవిష్యత్తులో భారత జట్టుకు కూడా కొత్త రికార్డులు సృష్టిస్తాడని ఆశిస్తున్నాను" అని నితీష్ కుమార్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## వావ్.. ఐపీఎల్ చరిత్రలోనే సూపర్ క్యాచ్!

ఐపీఎల్2025లో అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ దుష్మంత చమీర అద్భుతమైన ఫీల్డింగ్ ప్రదర్శన కనబరిచాడు. చమీరా సంచలన క్యాచ్‌తో అనుకుల్ రాయ్‌ను పెవిలియన్‌కు పంపాడు. చమీరా క్యాచ్ అంతా షాక్ అయిపోయారు. కేకేఆర్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన స్టార్క్ బౌలింగ్‌లో మూడో బంతికి రావ్‌మన్ పావెల్ వికెట్లు ముందు దొరికిపోయాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన అనుకుల్ రాయ్‌కు స్టార్క్ నాలుగో బంతిని మిడిల్ అండ్ లెగ్ దిశగా సంధించాడు. ఆ డెలివరీని అనుకుల్ రాయ్ డీప్ స్క్వేర్ లెగ్ దిశగా ఫ్లిక్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. షాట్ సరిగ్గా కనక్ట్ కావడంతో అంతా బౌండరీ వెళ్తుందని భావించారు. కానీ స్క్వేర్ లెగ్‌లో ఉన్న చమీరా అద్భుత విన్యాసం చేశాడు. స్క్వేర్ లెగ్ నుంచి పరిగెత్తుకుంటూ గాల్లోకి జంప్ చేస్తూ స్టన్నింగ్ క్యాచ్‌ను అందుకున్నాడు. దీంతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు మొత్తం ఒక్కసారిగా బిత్తరపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటిగా నెటిజన్లు కొనియాడుతున్నారు. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లలో రఘువంశీ(44) టాప్ స్కోరర్‌గా నిలవగా.. రింకూ సింగ్(36), గుర్బాజ్(26), నరైన్(27), రహానే(26) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్,విప్రజ్ నిగమ్ తలా రెండు వికెట్లు సాధించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని ఎమ్మెల్యేకు వినతి



**కాటారం, మహా :** ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని శాంతి చర్చలు జరపాలని కోరుతూ భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్,భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాశ్ రెడ్డి, కూడా చైర్మన్ రెడ్డి ఇనుముల వెంకట్రామిరెడ్డి లకు తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. దండకారణ్యం లో చత్తీస్గడ్ రాష్ట్రం తెలంగాణ సరిహద్దు ఆదివాసి ప్రాంతం కర్రెగుట్టలపై బాంబులు, తుపాకి మోతలతో దద్దరిల్లుతున్నాయని......ఆదివాసి జాతులను కనుమరుగై పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశమై ఆపరేషన్ కగార్ ఎత్తివేసేలా మావోయిస్టుతో ఆదివాసులతో చర్చలు జరిపేలా చూస్తామని ఎమ్మెల్యే సత్యనారాయణ రావు, కార్పొరేషన్ చైర్మన్లు ఐత ప్రకాశ్ రెడ్డి, వెంకట్రాంరెడ్డిలు హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రజాఫంట్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు పీక కిరణ్, తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమైక్య దాసరి రమేష్. తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా నాయకుడు దారకొండ సూర్య శంకర్ లు పాల్గొన్నారు.

## జైలు నుండి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**హన్మకొండ, మహా;** దొంగతనాలను కట్టడి చేసేందుకు చోరీ కేసుల్లో శిక్ష అనుభవించి జైలునుండి బయటకు వచ్చే దొంగల పై నిఘా పెట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు. మార్చి నెలకు సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్ కు పిలిపించడం కాకుండా, అధికారులే నేరుగా రౌడీ షీటర్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం లేదా రౌడీ షీటర్ ప్రస్తుత స్థితిగతులను అరా తీయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో సిసి కెమెరాలు కీలకంగా నిలుస్తున్నాని, ఇందుకు గాను పోలీస్ స్టేషన్ పరిధిలో కెమెరా పనితీరుపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని.కొత్త సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, పోలీస్ స్టేషన్ ల్లో పని చేసే మహిళా సిబ్బందితో అన్ని రకాల విధుల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సిబ్బందిలో స్టేషన్ అధికారులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని. జాతీయస్థాయిలో గుర్తింపు, అవార్డులు తీసుకొచ్చే విధంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండాలని, రేయి పగలు ప్రజల కోసం పనిచేయాల్సి ఉంటుందని పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చే పోలీసు అధికారులకు రివార్డులు అవార్డులు ఉంటాయని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు రాజమ హేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనార్ధన్, జనగాం ఏఎస్పీ చైతన్య, ఏ.ఎస్పీ మనాన్‌భట్, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు ఆర్థిక సహాయం

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కొండా వీరాభిమాని కోడం శివ కృష్ణ



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 33వ డివిజన్ లోని కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా వీరాభిమాని కోడం శివకృష్ణ దృష్టికి తీసుకురాగా మంచి నీటి సమస్యను పరిష్కరించడానికి కోడం శివ కృష్ణ ముందుకు వచ్చి మానవతా హృదయంతో కాలనీకి వెళ్ళవలసిన పైప్ లైన్ మెటీరియల్ కోసం తన వంతు ఆర్థిక సహాయంగా 15,000 రూపాయలు కాలనీ వాసులకు అందజేశారు. ఇందుకు కాలనీ వాసులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముష్క మల్ల సుధాకర్, కత్తెరశాల శ్రీధర్, హుస్సేన్, ప్రతాప్, ముఖ్య నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మోదీ పథకాలపై ప్రజల్లోకి బీజేపీ ప్రచారం

### రావిర్యాలలో గావ్ చలో – బస్తీ చలోకి ఘన స్పందన!

### పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, విష్ణు వర్ధన్ రెడ్డి



**షాద్ నగర్, మహా:** చౌదర్ గూడెం మండలంలోని రావిర్యాల గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు కొండా శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో "గావ్ చలో బస్తీ చలో" కార్యక్రమాన్ని బీజేపీ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, పాలమూరు బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశం ముందుకు సాగుతోంది. మోదీ గారి సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా కోట్లాది మందికి లబ్ధిని కలిగిస్తున్నాయి. తెలంగాణలో కూడా ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనందరిపై ఉంది. ప్రతి బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతం కావాలి" అని అన్నారు.కార్యక్రమంలో నాయకులు గ్రామంలో తిరుగుతూ ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని మోదీ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అంగడి వాడి, రేషన్ షాప్, కుట్టుమిషన్ షాప్ లను సందర్శించి మోదీ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి చర్చ జరిపారు.ఈ సందర్భంగా గ్రామంలోని సోమలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామి వారికీ అభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయ కుర్మయ్య, పసుపుల ప్రశాంత్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ అనిల్, గొల్ల రాజు, భూత్ అధ్యక్షులు ధీమా యాదయ్య, రాజు, పరిగి శివ కుమార్, విటలయ్య, సత్యం, ఇస్తారయ్య, లక్ష్మయ్య, చెనగాళ్ల యాదగిరి, చిల్ల రమేష్, కోట్ల ప్రశాంత్ రెడ్డి, గోధుమరాసి మల్లేష్, దశరథం, చిల్ల తిరుపతయ్య, పవన్ కుమార్, K. శ్రీను, M. శ్రీను తదితరులు పాల్గొన్నారు.బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో మోదీ ప్రభుత్వం తలపెట్టిన సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసం కల్పించే విధంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## స్వేచ్ఛగా సర్వే చేసి.. చెరువులను కాపాడండి

### సీపీఎం అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా



**అబ్దుల్లాపూర్మెట్,మహా:** స్వేచ్ఛగా సర్వే చేసి.. వేముల కత్వ, ఇందిరా సాగర్ చెరువులను కాపాడాలని సీపీఎం అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా అన్నారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలం, అనాజ్పూర్ గ్రామంలో ఇందిరా సాగర్, వేముల కత్వలను సంబంధిత అధికారులు సర్వే నిర్వహించారు. అధికారుల సర్వే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పుల నర్సింహా మాట్లాడుతూ... ఇందిరా సాగర్, వేముల కత్వలను జీనియస్ రియల్ ఎస్టేట్ సంస్థ ఈ చెరువుల ఎఫ్టీఎల్ ఏరియాలో పెద్ద, పెద్ద బండరాళ్లు, మట్టి పూడ్చివేశారని.. సంస్థ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ పోరాడిందని... ఫలితంగా అధికారులు సర్వే చేస్తున్నారని అన్నారు. ఇందిరా సాగర్, వేముల కత్వాలను నిజాం కాలంలో కట్టిన డ్యాములు, ఈ చెరువుల వల్ల అనాజ్పూర్ కింది భాగంలో ఉన్న దాదాపు 500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుదన్నారు. అలాగే భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఈ చెరువు కబ్జాచేసి పూడ్చాలని చూస్తే ఈ ప్రాంతం ఏడారి మారే దుస్థితి ఉంది. పశువులకు, గొర్రలకు పశుగ్రాసం దొరకాదు. మత్స్యకారులకు జీవనోపాధి కోల్పోతారు. ఇప్పటి వరకు ఎన్నడూ ఎండిపోని ఇందిరా సాగర్.. జీవనదిలాగా ఈ ప్రాంతంలో ఎప్పటికీ పారుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కావాలి రాములు, కావలి జంగయ్య, రవికుమార్, మహేష్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులదే కీలకపాత్ర

### బీజేపీ, ఆర్ఎస్ఎస్ లను ఎదుర్కొనే సత్తా యువజన కాంగ్రెస్ కు ఉంది.. బూత్ స్థాయి నుంచి యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేయండి

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్,మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్




**ఎల్బీనగర్,మహా:** పదేళ్ల బీఆర్ఎస్ పాలనను అంతమొందించడంలో యువజన కాంగ్రెస్ ఎంతో కీలకంగా పని చేసిందిని,యువజన నాయకులే ముందుండి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఎల్బీనగర్ లో జరిగిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్,టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి మీ నాయకత్వాన్ని చట్టసభల్లో వెళ్లేలా శ్రమ పడండి అని వారికి మంత్రి సూచించారు. స్థానిక సంస్థలు,సహకార ఎన్నికలు ఏ ఎన్నిక. అయినా యువజన కాంగ్రెస్ పాత్ర ఉండాలన్నారు. రాహుల్ గాంధీ స్వయంగా యువజన కాంగ్రెస్ ముందుకు పోవాలని సూచిస్తున్నారని చెప్పారు.దేశ భవిష్యత్తు యూత్ కాంగ్రెస్ మీద ఉందన్నారు.క్షేత్ర స్థాయిలో యూత్ కాంగ్రెస్ నేతలు పని చేయాలని సూచించారు.రాజకీయాల్లో పని చేసుకుంటూ పోతే శ్రమపడితే పలితం అదే వస్తుందని,తెలంగాణలో కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టాన్ని చేశామని గుర్తు చేశారు.దేశ వ్యాప్తంగా కుల గణన చేసి దిక్సూచిగా మారమని యువజన కాంగ్రెస్ పార్టీకి గుండె లాంటిందన్నారు.కాంగ్రెస్ పార్టీ నడవడానికి మీ శ్రమ దారపోయండని యూత్ కాంగ్రెస్ నేతలకు సూచించారు.

**మధుయాష్కీ మాట్లాడుతూ...**

కష్టపడిన నాయకులను గుర్తించి పార్టీ తప్పకుండా ప్రోత్సహిస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం మంగళవారం నాగోల్ డివిజన్ రాక్ హిల్స్ కాలనీలోని ఎస్వీఎల్ ఎరీనా గార్డెన్ లో జరిగింది. ఈ సందర్భంగా హాజరైన మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే యూత్ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో బలంగా పని చేయాలన్నారు. దేశంలో బిజెపిని, ఆర్ఎస్ఎస్ ను ఎదుర్కొనేందుకు యువజన కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ శక్తి యువజన కాంగ్రెస్ కే ఉంది అనేది నేను బలంగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేసినప్పుడే... కాంగ్రెస్ పార్టీ పటిష్టత ఉంటుందన్నారు. యువజన కాంగ్రెస్ లో చురుగ్గా పనిచేసే వారిని గుర్తించి వారిని నాయకులుగా ప్రోత్సహించే బాధ్యత తమదని పేర్కొన్నారు. నాయకులుగా.. నాయకులను తయారు చేసే బాధ్యత తమదన్నారు. భవిష్యత్తు అంతా యువజన కాంగ్రెస్ నాయకులదే అని.. మరోసారి తెలంగాణలో కాంగ్రెస్ కు అధికారంలోకి తీసుకురావడంలో యువజన కాంగ్రెస్ తమదైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయభాను చిబ్, రాజ్యసభ సభ్యులు అనిల్ అనిల్ యాదవ్,యూత్ కాంగ్రెస్ ఇంచార్జి కృష్ణ అల్లవాను,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## కలకాలం పేరు నిలిచేలా పనిచేస్తా

- నా దృష్టిలో అందరూ కార్పొరేటర్లు సమానమే
- పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వడంతోనే మేయర్ పదవి దక్కింది
- జర్నలిస్టులతో విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్

**విశాఖ ,మహా :** నా దృష్టిలో అందరు కార్పొరేటర్లు సమానమైన అని విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్ అన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ మద్దతు ఇవ్వడంతోనే తనకు మేయర్ పదవి దక్కిందని ఆయన పేర్కొన్నారు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ సభ్యులు రావులవలస రామ చంద్ర రావు ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆయనను అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరస్థాయిగా మంచి పేరు నిలిచేలా పనిచేస్తానని తాను ప్రజల మేయర్ గా నిలవాలన్నది ఆకాంక్షగా పేర్కొన్నారు ఏ పార్టీలో ఉన్నప్పటికీ సభ్యులందరూ సమానమని త్వరలోనే అన్ని వార్డుల సమస్యలు తెలుసుకుని ఆ వార్డు కార్పొరేటర్ సహాయంతో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. తన తండ్రి పీలా మహాలక్ష్మి నాయుడు పేరు నిలబెడతానని అన్నారు ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష మేరకు విశాఖ అభివృద్ధి కోసం అధికారులు ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటానని కొత్త మేయర్ పీలా శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే చంద్రమోహన్... వైజాగ్ ఎక్స్ప్రెస్ వ్యవస్థాపకులు నారాయణరావు ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు గోగుల శ్రీనివాస్ , ఎండి కమాలుద్దీన్ తదితరులు మేయర్ ను అభినందించారు. విశాఖ అభివృద్ధిలో జర్నలిస్టుల సహకారం కూడా తీసుకుంటానని అన్నారు.




## నారీశక్తి అవార్డు స్వీకరించిన సత్యకుమారి


**విశాఖ,మహా :** విశాఖ నగరానికి కి చెందిన సామాజిక సేవకురాలు యూ.సత్యకుమారికి ఎంతో ప్రతిష్టాత్మకమైన నారీశక్తి అవార్డు 2025 లభించింది.ఈ అవార్డును దూప్రా దర్శక్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు ఆమె నగరంలోని ప్రజలకు, విద్యార్థులకు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఉమెన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ కేటగిరిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన అవార్డును సత్యకుమారికి అందజేశారు.ఈ అవార్డును ప్రముఖ నటి సుధా చంద్రంజీ, మిసెస్ ఇండియా మంజిరి చేతుల మీదగా స్వీకరించారు. ప్రస్తుతం ఆమె నగరంలోని 14 ఏళ్లుగా బీపీవోగా విధులు నిర్వహిస్తూ,అటు విధి నిర్వహణ, కుటుంబాన్ని పైతం ఏకధాటిపై చూసుకుంటూ. నగరంలోని పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.ముఖ్యంగా సమాజంలో మహిళా ప్రాధాన్యత, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై పాఠశాల,కళాశాల స్థాయి నుంచి విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.అదే విధంగా విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్, మెంటల్ అవేర్నెస్ వంటి వాటిపై కూడా శిక్షణ అందిస్తున్నారు. ఎంతో అత్యున్నతమైన నారీశక్తి అవార్డును స్వీకరించిన సత్యకుమారికి తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## మన్నెగూడలో డీసీసీబీ నూతన శాఖ ఆవిష్కరణ

### పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పరిగి నియోజకవర్గం రైతుల ఆర్థిక అవసరాలను తీర్చేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించే లక్ష్యంతో ది హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (డీసీసీబీ) నూతన బ్రాంచ్ ను పూడూర్ మండలం, మన్నెగూడలో ఏర్పాటు చేసారు. ఈ శాఖను పరిగి శాసనసభ్యులు టీ రామ్మోహన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి నూతన బ్యాంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు పట్లోళ్ల అంజి రెడ్డి, కిషన్ నాయక్, మొగులయ్య, బ్యాంక్ సీఈఓ భాస్కర సుబ్రహ్మణ్యం, జీఎంలు ఫణి రామ్, ప్రభాకర్ రెడ్డి, పూడూర్ సొసైటీ చైర్మన సతీష్ రెడ్డి రెడ్డి, గండీడ్ సొసైటీ చైర్మన్ లక్ష్మినారాయణ్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రాంతీయ రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక వాడలు

- ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసేలా యువతకు ప్రోత్సాహం
- మొబిలిటీ వ్యాలీ పార్క్ భూమి పూజలో మంత్రి శ్రీధర్ బాబు


**మహా:** తెలంగాణను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమలను ఏర్పాటు చేసేలా తెలంగాణ యువతను ప్రోత్సహిస్తామన్నారు. రూ.44.3 కోట్లతో టీజీఐఐసీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం ఎనకతల గ్రామంలో అభివృద్ధి చేయనున్న "మొబిలిటీ వ్యాలీ పార్క్" కు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 862 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ పార్క్ ద్వారా దాదాపు పదివేల మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. పరిశ్రమల ఏర్పాటును కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని, వాటిని మరింత బలోపేతం చేసేందుకే ప్రత్యేక పాలసీ తెచ్చామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో మంది పారిశ్రామికవేత్తలు ముందుకొస్తుంటే, కావాలనే కొంత మంది పనిగట్టుకొని మా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రగతికి అడ్డంకిగా మారే ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎంఎల్ఏలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జైలు నుండి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**హన్మకొండ, మహా;** దొంగతనాలను కట్టడి చేసేందుకు చోరీ కేసుల్లో శిక్ష అనుభవించి జైలునుండి బయటకు వచ్చే దొంగల పై నిఘా పెట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు. మార్చి నెలకు సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్ కు పిలిపించడం కాకుండా, అధికారులే నేరుగా రౌడీ షీటర్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం లేదా రౌడీ షీటర్ ప్రస్తుత స్థితిగతులను అరా తీయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో సిసి కెమెరాలు కీలకంగా నిలుస్తున్నాని, ఇందుకు గాను పోలీస్ స్టేషన్ పరిధిలో కెమెరా పనితీరుపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని. కొత్త సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, పోలీస్ స్టేషన్ ల్లో పని చేసే మహిళా సిబ్బందితో అన్ని రకాల విధుల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సిబ్బందిలో స్టేషన్ అధికారులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని. జాతీయస్థాయిలో గుర్తింపు, అవార్డులు తీసుకొచ్చే విధంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండాలని, రేయి పగలు ప్రజల కోసం పనిచేయాల్సి ఉంటుందని పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చే పోలీసు అధికారులకు రివార్డులు అవార్డులు ఉంటాయని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు రాజమ హేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనార్ధన్, జనగాం ఏఎస్పీ చైతన్య, ఏ.ఎస్పీ మనాన్‌భట్, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్నారు.



## సరూర్ నగర చెరువు లో పడి చిన్నారి మృతి

**బాలాపూర్ మహా:** ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సరూర్ నగర్ చెరువు లో పడి అభిత అనే 6 ఆరు సంవత్సరాల చిన్నారి మృతి చెందిన సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి లో చోటుచేసుకుంది. చెరువు చుట్టు పెన్సిగ్ లేకపోవడం తో చెరువులో పడిపోయిన చిన్నారి. గ్రీన్ పార్క్ కాలనీ రోడ్ నంబర్ 14లో చెరువు పక్కన కాలనీ లో నివాసం ఉంటున్న నెల్లూరు జిల్లా కు చెందిన పాలకుర్తి శ్రీను, శ్రావణి దంపతులు. వీరికి నలుగురు ఆడపిల్లలు. ఈ దంపతుల రెండవ కూతురు అభిత (6) నిన్న చెరువు లో సాయంత్రం నాలుగు గంటలకు పడిపోయి ,ఈరోజు ఉదయం వాటర్ లో పైకి తేలడం తో గుర్తించి బయటికి తీసిన కుటుంబ సభ్యులు. కన్నీరు,మున్నేరుగా రోదిస్తున్న కుటుంబ సభ్యులు. ఇప్పటి వరకు స్పందించని ఇరిగేషన్ శాఖ అధికారులు. గతం లో చెరువు చుట్టూ పెన్సింగ్ కి ఐదున్నర కోట్ల టెండర్. పనులు ప్రారంభించకపోవడం తో తమ చిన్నారి మృతి చెందిందని కుటుంబ సభ్యుల ఆవేదన. బాధిత నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయల ఇచ్చి ఆదుకోవాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్.